సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 31.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 359
పేజీలు: 08 వెల: రూ. 5

గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతాం

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్ల భారీ ప్రణాళిక

- మూసీ పునరుజ్జీవనంతో హైదరాబాద్‌కు కొత్త అందం
- ఫ్యూచర్ సిటీతో తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశ
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం: భట్టి విక్రమార్క
- నరేద్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో భట్టి విక్రమార్క

06

హైదరాబాద్‌కు
కొత్త కళ

గోదావరి నీటితో నిండనున్న జంట జలాశయాలు

03

- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా కీలక పనులు
- ఘన్‌పూర్, హిమాయత్‌సాగర్ వద్ద భారీ నీటి శుద్ధి కేంద్రాలు
- కోకాపేట్ నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు పైప్‌లైన్ నిర్మాణం
- పదేళ్ల పాటు ప్రాజెక్టు నిర్వహణకు ప్రభుత్వ అనుమతులు

అక్రమంగా
అండాల సేకరణ

ఫెర్టిలిటీ సెంటర్లకు అమ్మకం

- పోలీసుల దాడులు
- గర్ల్స్ హాస్టల్ ముసుగులో అండాల విక్రయాలు?
- సంతాన కేంద్రాలకు అండాల సరఫరా.. ముఠా గుట్టురట్టు!
- బిహార్, యూపీ, ఒడిశా యువతులే టార్గెట్‌గా అక్రమ దందా?
- అండాలు, వీర్యకణాల సరఫరాపైనా పోలీసుల ఆరా!

03

రూ.1.50 లక్షల కోట్ల
ప్రభుత్వ భూముల
కబ్జాకు ప్లాన్

వాటిని సమర్థంగా కాపాడాం: సీఎం రేవంత్

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

ముద్ర, తెలంగాణ బ్యూరో : మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్గరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. మిగతా 02లో

ఎల్‌నినోపై
రాజకీయ క్రీడ

ఏపీని అస్త్రంగా చేసుకున్న కేటీఆర్!

ఎల్‌నినోపై కేటీఆర్ పొలిటికల్ గేమ్

తెలంగాణలో కరువు.. ఆంధ్రలో బాగుందంటూ రేవంత్‌పై విమర్శలు

21 జిల్లాల్లో 388 కరువు మండలాలు ప్రకటించిన ఏపీ..

రేవంత్‌ను ఇరికించే కొత్త వ్యూహం

కరువుపై మొదలైన రాజకీయ రగడ

ఏపీ వర్సెస్ తెలంగాణ.. కేటీఆర్ కొత్త వాదన

రైతుల కష్టాలపై రాజకీయ చదరంగం

కరువు కష్టాల్లోనూ అధికార, ప్రతిపక్ష పోరు



ముద్ర, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో నెల కొన్న వర్షాభావం, నీటి కొరత ఇప్పుడు రాజకీయ యుద్ధానికి కేంద్రబిందువుగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డి పనితీరును ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీలో కరువు పరిస్థితులను ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంటుంటే.. తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి వైఫల్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ కేటీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఏపీలోనూ కరువు తీవ్రత తక్కువేమీ కాదనే వాస్తవం ఈ రాజకీయ ప్రచారానికి కొత్త కోణాన్ని జోడిస్తోంది.
ఏపీ బాగుంది..

తెలంగాణలోనే కష్టాలా?

ఎల్‌నినో ప్రభావం ఒక్క తెలంగాణకే పరిమితం కాలేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఏకంగా 21 జిల్లాల్లోని 388 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ తెలంగాణతో పోలిస్తే ఏపీలో పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయనే వాదనను కేటీఆర్ తెరపైకి తెస్తున్నారు. రేవంత్ ప్రభుత్వానికి నీటి నిర్వహణపై సరైన ప్రణాళిక లేదని, ప్రకృతి వైపరీత్యాల పేరుతో బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని విమర్శిస్తున్నారు.

రాయలసీమలోనూ రైతుల కష్టాలు

ముఖ్యంగా రాయలసీమలో వర్షాభావం తీవ్ర ప్రభావం చూపింది. నీటి వనరులు అడుగంటడంతో వేరుశనగ, పత్తి, వరి వంటి పంటలు దెబ్బతిన్నాయి. బోర్లు ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. హంద్రీ–నీవా, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లడం లేదా సాగును విరమించుకోవడం తప్ప రైతులకు మరో మార్గం లేకుండా పోయింది. ఏపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ, తాగు నీటి సరఫరా, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై దృష్టి పెట్టినప్పటికీ.. క్షేత్రస్థాయిలో రైతుల ఆర్థిక ఇబ్బందులు మాత్రం కొనసాగుతున్నాయి. అప్పులు, పెట్టుబడుల నష్టాలు, పంట దిగుబడులు తగ్గిపోవడం వంటి సమస్యలు రెండు రాష్ట్రాల్లోనూ అన్నదాతలను వెంటాడుతున్నాయి.

డిఫెన్స్‌లోకి నెట్టడమే లక్ష్యమా?

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని బీఆర్ఎస్ ప్రధానంగా ప్రశ్నిస్తోంది. డ్యామ్ భద్రత, సాంకేతిక అంశాల కారణంగా కాళేశ్వరం నుంచి నీటిని వినియోగించడంలో ప్రభుత్వం చూపుతున్న జాగ్రత్తలను కేటీఆర్ వైఫల్యంగా మిగతా 02లో

సంక్షోభంలోనూ
రాజకీయాలా?

02

విపక్షాలపై మోదీ ఫైర్

- దేశం కష్టాల్లో ఉంటే వారికి సంతోషం.. మోదీ ఆగ్రహం
- ఎరువులు, గ్యాస్‌పై వదంతులా?..
- మోదీని దెబ్బతీయడమే లక్ష్యమా?..
- రైతులపై భారం పడనివ్వం..
- బనస్కాంత సభలో మోదీ హామీ

సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి
వరుస విజయాలు

కంచె గచ్చిబౌలి, మియాపూర్ భూములపై అనుకూల తీర్పులు

- రెవెన్యూ అధికారులకు పొంగులేటి అభినందనలు
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు
- ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

02

పేదరికంపై
భారత్ గెలుపు

ప్రపంచ బ్యాంకు ప్రశంసలు

- 12 ఏళ్లలో 496 మిలియన్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- తీవ్ర పేదరికం 27.1% నుంచి 2.6 శాతానికి పడిపోయిందన్న ప్రపంచ బ్యాంకు
- గ్రామీణ మహిళల ఉపాధి పెరగడం ప్రధాన కారణమని విశ్లేషణ

02

హైదరాబాద్‌కు
తాగునీటి సవాల్

- జనవరి నుంచి 8 నెలల పాటు భారీ నీటి కష్టాలు
- జలమండలి ఎండీ వార్నింగ్
- మంజీరా, సింగూరు ప్రాజెక్టుల నుంచి 100 ఎంజీడీ నీటి కొరత అంచనా
- హైదరాబాద్‌లో 7 నియోజకవర్గాలపై నీటి సంక్షోభ ప్రభావం

02

ముగిసిన ప్రచారం

స్థానిక ఎన్నికల్లో కూటమి ఖాతాలో 17 కార్పొరేషన్లు

- పోలింగ్‌కు ముందే కూటమికి విజయం..
- స్థానిక ఎన్నికల్లో కూటమి జోరు.. టీడీపీకి 15 స్థానాలు!
- ఏకగ్రీవాల్లో కూటమి హవా.. జనసేన, బీజేపీకి చెరో స్థానం!
- కడప జిల్లాలోనూ కూటమి పాగా.. ఆరు పట్టణ స్థానాలు ఏకగ్రీవం!

02

ఇదీ AI ముద్ర



మలబద్ధకం సమస్యకు చెక్!

అరటిపండులోని డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రోజూ ఒక అరటి పండు తినడం వల్ల పేగుల పనితీరు మెరుగుపడి మలబద్ధకం సమస్య తగ్గేందుకు సహాయపడుతుంది.

ప్రభుత్వ భూముల కబ్జాకు ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)
హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్ ప్రకటించారు.ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలన్నారు.

ముగిసిన ప్రచారం..

ముద్ర, అమరావతి :
ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార ఘట్టం అధికారికంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13 నగరపాలక సంస్థలు (మున్సిపల్ కార్పొరేషన్లు), వివిధ మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో నవంబర్ 1న పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అయితే.. పోలింగ్‌కు ముందే రాష్ట్రంలో అధికార ఎన్డీయే కూటమి (టీడీపీ–జనసేన–బీజేపీ) భారీగా ఏకగ్రీవాలను కైవసం చేసుకుని తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. మొత్తం 17 మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలను కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా సొంతం చేసుకున్నారు. ఇందులో తెలుగుదేశం పార్టీ ఏకంగా 15 స్థానాలను చేజిక్కించుకోగా, జనసేన పార్టీ, బీజేపీ చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి.
టీడీపీ ఖాతాలోకి దాచేపల్లి, పిడుగురాళ్ల, గురజాల, నగరి, కనిగిరి, బద్వేలు, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు, రాజంపేట, పుంగనూరు, రాయచోటి, గుత్తి, ఆళ్లగడ్డ, ఆత్మకూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలు ఏకగ్రీవంగా చేరాయి. అదేవిధంగా ప్రకాశం జిల్లాలోని దర్శి ఛైర్‌పర్సన్ స్థానాన్ని జనసేన దక్కించుకోగా, వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఎర్రగుంట్ల ఛైర్‌పర్సన్ స్థానాన్ని బీజేపీ ఏకగ్రీవంగా సొంతం చేసుకుంది.
ముఖ్యంగా వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలోనే మొత్తం 6 పట్టణ స్థానిక సంస్థలు కూటమి ఖాతాలోకి వెళ్లడం గమనార్హం. వార్డులు, డివిజన్ల పరిధిలోనూ కూటమికి భారీగా ఏకగ్రీవాలు లభించాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలలోని వార్డులలో 21 శాతానికి పైగా స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక 13 కార్పొరేషన్లలోని మొత్తం 922 డివిజన్లలో 118 డివిజన్లు (12 శాతానికి పైగా) ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రచారం ముగియడంతో ఎన్నికల సంఘం తుది పోలింగ్ ప్రక్రియపై దృష్టి సారించింది.

సంక్షోభంలోనూ రాజకీయాలా?

ముద్ర, న్యూఢిల్లీ :
ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొన్న సమయంలో దేశంలో విపక్షాలు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ప్రజల్లో భయాందోళన సృష్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ 24వ విడత నిధులను విడుదల చేసిన సందర్భం గా ప్రతిపక్ష పార్టీల చర్యలను ఖండించారు.
'దేశంలో ప్రజలంతా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే.. కొన్ని రాజకీయ వర్గాలు దేశ ప్రగతి పట్ల అసంతృప్తిగా ఉన్నాయి. దేశం ఇబ్బందుల్లో పడాలని వారు కోరుకుంటున్నారు. గల్ఫ్ ఉద్రిక్తతల కారణంగా అనిశ్చిత పరిస్థితులుంటే.. ఎరువులు, గ్యాస్ కొరత గురించి వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి.. మోదీని దెబ్బతీయాలన్నది వారి ప్లాన్. దేశం కష్టాల్లో ఉండాలని కోరుకునే వీరు.. సంక్షోభ సమయాల్లో సంతోషిస్తారు' అని విపక్షాలపై మోదీ (PM Modi) మండిపడ్డారు. రైతులకు అండగా ఉంటామని గతంలో ఇచ్చిన హామీకి తగ్గట్టే తమ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినా ఆ భారాన్ని రైతులపై పడనివ్వడం లేదని గుర్తు చేశారు.
ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్) పథకంలో భాగంగా 24వ విడతలో సుమారు రూ.19వేల కోట్లను ప్రధాని మోదీ నేడు విడుదల చేశారు. ఆ నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. దీని కింద వ్యాప్తంగా 9.34 కోట్లమంది రైతులు లబ్ధిపొందారు.

పేదరికంపై గెలుపు

ముద్ర, తెలంగాణ బ్యూరో :
పేదరిక నిర్మూలనలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా పురోగమిస్తున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2011 నుంచి 2023 మధ్య 12 ఏళ్ల కాలంలో దేశంలో సుమారు 496 మిలియన్ల మంది (దాదాపు 50 కోట్లు) ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని తన తాజా నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి కేవలం 2.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.
ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'అక్టోబర్ 2026 ఇండియా పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్' నివేదిక ప్రకారం, రోజుకు 4.20 డాలర్ల (సుమారు రూ. 350) కంటే తక్కువ ఆదాయంతో జీవించే జనాభా 2011లో 57.7 శాతం ఉండగా, 2023 నాటికి అది 16.1 శాతానికి తగ్గింది. తీవ్ర పేదరికానికి సూచికగా భావించే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 250) ఆదాయ పరిమితి కంటే దిగువన ఉన్న వారి సంఖ్య 27.1 శాతం నుంచి 2.6 శాతానికి పడిపోయింది. దేశంలో వినియోగం పెరగడం, ఉపాధి అవకాశాలు మెరుగుపడటం, ఆహార సబ్సిడీల వంటి ప్రభుత్వ సామాజిక బదిలీ పథకాల వల్లే ఈ అద్భుతమైన ప్రగతి సాధ్యమైందని నివేదిక విశ్లేషించింది.
ముఖ్యంగా 2017–2023 మధ్య కాలంలో దేశంలో కొత్తగా 134 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, ఇందులో గ్రామీణ ప్రాంత మహిళలు వేతనంతో కూడిన పనుల్లోకి రావడం కీలక పాత్ర పోషించిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అయితే, కొత్తగా వచ్చిన ఉద్యోగాల్లో చాలా వరకు తక్కువ ఉత్పాదకత ఉన్న రంగాల్లోనే ఉండటంతో, ఉద్యోగుల వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పు కనిపించలేదని పేర్కొంది.
పేదరికం గణనీయంగా తగ్గినప్పటికీ, దేశంలో ఆదాయ అసమానతలు ఇప్పటికీ తీవ్రంగానే ఉన్నాయి. అత్యధిక వేతనం పొందే మొదటి 10 శాతం మంది ఉద్యోగుల ఆదాయం, అత్యల్ప వేతనం పొందే చివరి 10 శాతం మంది కంటే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అలాగే, పట్టణ ప్రాంతాల్లో పేదరికం 8.6 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 19.3 శాతంగా నమోదైంది. భవిష్యత్తులో పేదరికాన్ని మరింత తగ్గించాలంటే వ్యవసాయేతర రంగాల్లో అధిక ఉత్పాదకత, నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడంపై దృష్టి పెట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది.

ఎల్‌నినోపై రాజకీయ క్రీడ

(మొదటి పేజీ తరువాయి)
చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పక్క రాష్ట్రంలో కరువు పరిస్థితులను ప్రభుత్వం నిర్వహిస్తుంటే.. తెలంగాణలో మాత్రం రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కరువుపై పోరాటమా.. రాజకీయ పోరాటమా?

వాస్తవానికి ఎల్‌నినో ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాల పనితీరు, నీటి నిర్వహణ, రైతులకు అందుతున్న సహాయంపై చర్చ జరగాల్సిన సమయంలో రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలకు దిగుతున్నాయి. ఏపీని ఆదర్శంగా చూపుతూ తెలంగాణ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్న కేటీఆర్ వ్యూహం వెనుక రాజకీయ ప్రయోజనం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఎల్‌నినో సృష్టించిన వర్షాభావం రైతులకు కష్టాలు తెచ్చిపెడితే.. అదే పరిస్థితి ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల మధ్య కొత్త పోరుకు వేదికగా మారింది.

హైదరాబాద్‌లో భారీ వర్షం

ముద్ర, హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మణికొండ, రాయదుర్గం, షేక్‌పేట, తుర్కయంజాల్, మన్నెగూడ, కాప్రా, కీసర, నాగారం, టోలిచౌకి, కార్వాన్, రాజేంద్రనగర్, మెహదీపట్నం, యూసుఫ్‌గూడా, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్తున్న ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. కుత్బుల్లాపూర్ చౌరస్తా నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచింది.



హైదరాబాద్‌కు తాగునీటి సవాల్

ముద్ర, తెలంగాణ బ్యూరో :
హైదరాబాద్ నగరానికి 8 నెలల పాటు తీవ్ర నీటి కష్టాలు తప్పవని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. మంజీరా, సింగూరు జలాశయాలు అడుగంటిపోవడంతో సుమారు రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల (MGD) నీటి కొరత ఏర్పడనుందని ఆయన తెలిపారు. ఈ ప్రభావం వచ్చే ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుందని హెచ్చరించారు.
ప్రాజెక్టులలో నీటి మట్టాలు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో సమస్య తీవ్రంగా మారిందని అశోక్ రెడ్డి వివరించారు. ఈ కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి 100 MGD, కృష్ణా నది నుంచి 10–15 MGD, ఉస్మాన్‌సాగర్ నుంచి మరో 5 MGD నీటిని నగరానికి తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ చర్యల ద్వారా 60 శాతం కొరతను భర్తీ చేయగలిగినా, మరో 20 నుంచి 40 శాతం నీటి ఎద్దడి కొనసాగుతుందని ఆయన అంగీకరించారు.
ఈ నీటి సంక్షోభం ప్రభావం నగరంలోని ఏడు నియోజకవర్గాలపై అధికంగా ఉంటుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లిలో 80 శాతం వరకు నీటి సమస్య ఉండొచ్చని అంచనా వేశారు. అలాగే పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు ఉన్న ప్రాంతాల్లో సుమారు 3 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో నగరవాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సుప్రీంకోర్టులో వరుస విజయాలు

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు, దశాబ్దాలుగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు న్యాయపోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమితో పాటు, తాజాగా మియాపూర్ భూముల విషయంలోనూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు రావడాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ విజయాలు సీఎం ప్రత్యేక చొరవ, రెవెన్యూ శాఖ సమన్వయంతో సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.
ప్రభుత్వ భూములు రాష్ట్ర ప్రజల ఉమ్మడి ఆస్తి అని, వాటిని భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసిన రెవెన్యూ అధికారులు, న్యాయ నిపుణులు, ప్రభుత్వ న్యాయవాదులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ భూముల విషయంలో ఆక్రమణలకు పాల్పడినా, అక్రమ హక్కులు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నవంబర్ 5న సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

ముద్ర, హైదరాబాద్:
సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం దీపావళి బోనస్ ప్రకటించింది. సింగరేణి కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. నవంబర్ 5న బోనస్ చెల్లించనున్నట్టు తెలిపారు. అర్హులైన ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 వరకు బోనస్ లభించనుంది. ఇందుకోసం సింగరేణి యాజమాన్యం రూ.419 కోట్లు కేటాయించింది. దాదాపు 38వేల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు. దీపావళి బోనస్ మొత్తాన్ని నవంబర్ 5వ తేదీన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

ముద్ర, హైదరాబాద్:
వచ్చే ఏడాది జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణ న చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, మంచు తీవ్రత ఉండే ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాల్లో ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపుర్, గోవాలతోపాటు లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లోని మంచు తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో జనగణన ఉండదని పేర్కొంది. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసింది. జనగణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మార్చి ఒకటి నుంచి ఐదో తేదీ వరకు సవరణల కోసం సమయం ఇచ్చారు. ప్రజలు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి జనవరి 24 వరకు వీలు కల్పించారు. ఆన్‌లైన్ లేదా నిర్దేశిత విధానంలో ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చు. అనంతరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు.

అరటిపండుతో శరీరానికి తక్షణ శక్తి!

అరటిపండులో ఉండే సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి త్వరగా శక్తిని అందిస్తాయి. ఉదయం అల్పాహారంగా లేదా వ్యాయామానికి ముందు తీసుకుంటే ఉత్సాహంగా ఉండవచ్చు.

హైదరాబాద్‌కు కొత్త కళ..

ముద్ర, హైదరాబాద్ : భాగ్యనగరానికి తాగునీటిని, అందాన్ని అందించిన చారిత్రక ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు త్వరలోనే సరికొత్త శోభను సంతరించుకోనున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మూసీ పునరుజ్జీవన' ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలతో ఈ జంట జలాశయాలను నింపేందుకు పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. దీనికి సంబంధించి కీలకమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులకు శ్రీకారం చుడుతూ ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది.

భారీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు.. గ్రావిటీ పైప్‌లైన్లు

ఈ బృహత్తర ప్రాజెక్టులో భాగంగా గోదావరి నీటిని శుద్ధి చేసి జలాశయాలకు మళ్లించేందుకు అధునాతన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఘన్‌పూర్‌లో 120 ఎంఎల్డీ (MLD), అలాగే హిమాయత్‌సాగర్ వద్ద 70 ఎంఎల్డీ సామర్థ్యంతో భారీ నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు కోకాపేట్ నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు, ఉస్మాన్‌సాగర్ నుంచి హిమాయత్‌సాగర్‌ను అనుసంధానిస్తూ భారీ పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇక హిమాయత్‌సాగర్ నుంచి బుద్వేల్ రిజర్వాయర్‌కు నీటిని సజావుగా తరలించేందుకు కూడా ప్రత్యేక పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు.ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' విధానంలో పనులను అమలు చేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టు పనుల నియామక తేదీగా 2026 జూన్ 24ను నిర్ణయించిన ప్రభుత్వం, ప్రాజెక్టు నిర్వహణ , మౌలిక వసతులకు పదేళ్ల పాటు అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు నిరంతరం జలకళతో విలసిల్లుతుంది.

గోదావరి నీటితో నిండనున్న జంట జలాశయాలు..

యువతుల అండాల సేకరణ..

సంతాన కేంద్రాలకు అమ్ముకుంటున్న ముఠా పోలీసుల దాడులు
గర్ల్స్ హాస్టల్ ముసుగులో అండాల విక్రయాలు?
సంతాన కేంద్రాలకు అండాల సరఫరా.. ముఠా గుట్టురట్టు!
బీహార్, యూపీ, ఒడిశా యువతులే టార్గెట్‌గా అక్రమ దందా?
అండాలు, వీర్యకణాల సరఫరాపైనా పోలీసుల ఆరా!

ముద్ర, హైదరాబాద్ : సికింద్రాబాద్ బేగంపేట్ లో యువతుల అండాల సేకరణ వార్త కలకలం రేపింది. ప్రకాష్‌నగర్ లోని ఓ అపార్టుమెంట్ లో ఉంటున్న ముఠా అండాలు సేకరించి సంతాన సాఫల్యతా కేంద్రాలకు విక్రమయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో 2026 అక్టోబర్ 30 తెల్లవారుజామున పోలీసులు దాడులు చేశారు. ప్రాకాష్ నగర్ లోని నజ్రాన్ అపార్ట్‌మెంట్‌పై బేగంపేట పోలీసులు, SOT పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. కింది అంతస్తులో నివాసం ఉంటున్న పలువురు యువతులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 8 నుంచి 10 మంది యువతులు ఇక్కడే నివాసం ఉంటున్నట్లు సమాచారం.

గత ఏడాది కాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. యువతుల అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు. మహిళల అండాలతో పాటు పురుషుల వీర్యకణాల సరఫరా వ్యవహారంపైనా ఆరా తీస్తున్నారు.

ఈ వ్యవహారం వెనుక ఓ మహిళ ప్రమేయం ఉందనే అనుమానంతో ఆమెను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అండాల సేకరణ, విక్రయాలు, సంతాన సాఫల్య కేంద్రాలతో సంబంధాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు చెప్పారు.

హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి

అనంతారంలో మెగా ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలి
రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ముద్ర, న్యూఢిల్లీ: తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో భేటీ అయిన సీఎం.. హైదరాబాద్–పుణె, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్‌ను త్వరగా ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం ఆమోదం తెలిపిన వెంటనే భూసేకరణ చేపడతామని తెలిపారు. వికారాబాద్–కృష్ణా సహా డోర్నకల్–గద్వాల్, కల్వకుర్తి–మాచర్ల, పటాన్‌చెరు–ఆదిలాబాద్, బోధన్–లాతూర్ తదితర కొత్త రైల్వే మార్గాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మహబూబాబాద్ సమీపంలోని అనంతారంలో మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 409 ఎకరాలకు పైగా భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
31 అక్టోబర్, 2026

4

వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com

గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్

భయపడాలా? పరిణామాలు ఏంటి?

బహిష్టు సమయంలో అధిక రక్తస్రావం, కడుపు కింది భాగంలో నొప్పి, పొత్తి కడుపు ఉబ్బరంగా ఉండటం వంటి సమస్యలకు ఇవి కారణం కావచ్చు. కొంత మంది మహిళల్లో ఎలాంటి లక్షణాలూ కనిపించకుండా సాధారణ పరీక్షల్లోనే ఇవి బయటపడతాయి. ఫైబ్రాయిడ్స్ ఉన్న ప్రతి మహిళకూ శస్త్రచికిత్స అవసరం ఉండదు. వాటి పరిమాణం, స్థానం, లక్షణాల తీవ్రత, మహిళ వయసు, భవిష్యత్తులో పిల్లలు కావాలనే కోరిక ఆధారంగా చికిత్సను నిర్ణయిస్తారు. గర్భాశయంలో ఫైబ్రాయిడ్ ఉందంటే క్యాన్సర్ కాదు.

ఫైబ్రాయిడ్స్ అంటే ఏమిటి?

గర్భాశయ కండర కణజాలం నుంచి ఏర్పడే, సాధారణంగా క్యాన్సర్ కాని గడ్డలను గర్భాశయ ఫైబ్రాయిడ్స్ లేదా లియోమయోమాస్ (Leiomyomas) అంటారు. ఇవి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఏర్పడవచ్చు. కొన్ని చిన్నగా ఉండి ఎలాంటి ఇబ్బందీ కలిగించకపోవచ్చు. మరికొన్ని పెద్దవిగా పెరిగి గర్భాశయ ఆకృతిని మార్చవచ్చు. ఫైబ్రాయిడ్స్ సాధారణంగా పునరుత్పత్తి వయస్సులో ఉన్న మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. రుతుక్రమం ఆగిపోయిన తర్వాత హార్మోన్ల ప్రభావం తగ్గడంతో చాలావరకు ఫైబ్రాయిడ్స్ పరిమాణం తగ్గవచ్చు.

అయితే మెనోపాజ్ తర్వాత కొత్తగా గడ్డ కనిపించినా లేదా ఇప్పటికే ఉన్న గడ్డ పెరుగుతున్నట్లు అనిపించినా వైద్య పరీక్ష చేయించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో 50 ఏళ్ల వయసు వచ్చేసరికి సుమారు 70–80 శాతం మందికి ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ప్రతి పదిమంది మహిళల్లో 2 – 4 మంది మహిళల్లో ఈ ఫైబ్రాయిడ్స్ ఉండే అవకాశం ఉంది. అయితే, వీరిలో అందరికీ లక్షణాలు కనిపించవు. సాధారణంగా 30–40 ఏళ్ల మధ్య ఫైబ్రాయిడ్స్ ఎక్కువగా బయటపడుతుంటాయి. చిన్న వయసులోనూ ఇవి ఏర్పడవచ్చు.

ఫైబ్రాయిడ్స్ ఎందుకు ఏర్పడతాయి?

ఫైబ్రాయిడ్స్ ఏర్పడటానికి అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన అంశాలు, హార్మోన్లు, వయసు, జీవనశైలి సంబంధిత అంశాలు కలిసి ప్రభావం చూపవచ్చు.

ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్లు

ఈ రెండు హార్మోన్లు గర్భాశయ కణజాల పెరుగుదలలో పాత్ర పోషిస్తాయి. వీటి ప్రభావంతో ఫైబ్రాయిడ్స్ పెరిగే అవకాశం ఉంటుంది.

కుటుంబ చరిత్ర

తల్లి, అక్కాచెల్లెళ్లు లేదా ఇతర దగ్గరి కుటుంబ సభ్యులకు ఫైబ్రాయిడ్స్ ఉంటే కూడా ఇవి ఏర్పడే అవకాశం పెరుగుతుంది.

వయస్సు

ముఖ్యంగా పునరుత్పత్తి వయసులో ఫైబ్రాయిడ్స్ ఎక్కువగా కనిపిస్తాయి. మెనోపాజ్ తర్వాత సాధారణంగా వాటి పెరుగుదల మందగించవచ్చు.

అధిక బరువు, జీవనశైలి

అధిక బరువు, శారీరక శ్రమ తక్కువగా ఉండటం వంటి అంశాలకు, ఫైబ్రాయిడ్స్ ఏర్పడటానికి సంబంధం ఉన్నట్లు కొన్ని అధ్యయనాల్లో తేలింది. అయితే ఇవి ఫైబ్రాయిడ్‌కు ప్రత్యక్ష కారణమని చెప్పలేం.

జన్యుపరమైన మార్పులు

గర్భాశయ కండర కణాల్లో కొన్ని జన్యుపరమైన మార్పులు జరగడం వల్ల ఫైబ్రాయిడ్స్ ఏర్పడవచ్చు.

ఫైబ్రాయిడ్స్ ఏర్పడ్డాయంటే ఆ మహిళలు ఏదో తప్పు చేసినట్లు భావించకూడదు. ఇవి అంటువ్యాధి కావు. లైంగిక సంబంధాల వల్ల ఏర్పడవు.

ఫైబ్రాయిడ్స్‌లో ఎన్ని రకాలు?

గర్భాశయంలో ఏ ప్రాంతంలో ఫైబ్రాయిడ్ ఏర్పడిందనే దాన్నిబట్టి వాటి లక్షణాలు, చికిత్స మారతాయి.

సబ్‌మ్యూకోసల్ ఫైబ్రాయిడ్స్

గర్భాశయం లోపలి పొర కింద ఏర్పడతాయి. చిన్న పరిమాణంలో ఉన్నా నెలసరిలో అధిక రక్తస్రావం, గర్భధారణ సమస్యలకు కారణం కావచ్చు.

ఇంట్రామ్యూరల్ ఫైబ్రాయిడ్స్

గర్భాశయ కండర గోడలో ఏర్పడతాయి. సాధారణంగా కనిపించే రకాల్లో ఇవి ఒకటి. పరిమాణం పెరిగితే రుతుస్రావ సమస్యలు, పొత్తి కడుపులో ఒత్తిడి కలిగించవచ్చు.

సబ్‌సీరొసల్ ఫైబ్రాయిడ్స్

ఇవి గర్భాశయం వెలుపలి వైపు పెరుగుతాయి. ఇవి పెద్దవైతే మూత్రాశయం, పేగులపై ఒత్తిడి కలిగించవచ్చు.

పెడంక్యులేటెడ్ ఫైబ్రాయిడ్స్

ఇవి ఒక సన్నని కణజాలపు కాడపై వేలాడుతున్నట్లు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కాడ మెలితిరగడం వల్ల అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి రావచ్చు.

ఫైబ్రాయిడ్స్ లక్షణాలు ఏమిటి?

ఫైబ్రాయిడ్ ఉన్న ప్రతి మహిళలోనూ లక్షణాలు కనిపించవు. గడ్డ పరిమాణం, గర్భాశయంలో దాని స్థానం ఆధారంగా లక్షణాలు మారతాయి.

పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం
సాధారణం కంటే ఎక్కువ రోజులు రక్తస్రావం కొనసాగడం
నెలసరి సమయంలో తీవ్రమైన కడుపునొప్పి, తిమ్మిర్లు
నెలసరి మధ్యలో రక్తస్రావం
పొత్తి కడుపు కింది భాగంలో బరువుగా అనిపించడం లేదా ఉబ్బరంగా కనిపించడం
నడుము నొప్పి, కటి ప్రాంతంలో ఒత్తిడి
తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం
యూరినరీ ఇన్ఫెక్షన్స్
పెద్ద ఫైబ్రాయిడ్స్ వల్ల మూత్ర విసర్జనలో ఇబ్బంది లేదా మలబద్ధకం
లైంగిక కలయిక సమయంలో నొప్పి
రక్తహీనత కారణంగా నీరసం, అలసట, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది

నెలసరి సమయంలో అధిక రక్తస్రావం అవుతున్నప్పటికీ చాలా మంది మహిళలు దానిని సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ తరచుగా ప్యాడ్లు మార్చాల్సి రావడం, పెద్ద రక్తపు గడ్డలు పడటం, రక్తస్రావం వల్ల రోజువారీ పనులు చేయలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించి, పరీక్షలు చేయించుకోవాలి.

ఫైబ్రాయిడ్స్ వల్ల వచ్చే సమస్యలు

రక్తహీనత

అధిక రక్తస్రావం వల్ల శరీరంలో ఐరన్ నిల్వలు తగ్గి రక్తహీనత ఏర్పడవచ్చు. దీనివల్ల అలసట, నీరసం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన సందర్భాల్లో రక్తమార్పిడి అవసరమయ్యే అవకాశం ఉంది.

సంతానలేమి

అన్ని ఫైబ్రాయిడ్స్ వల్ల సంతానలేమి రాదు. అయితే, గర్భాశయ లోపలి కుహరాన్ని మార్చే ఫైబ్రాయిడ్స్ గర్భం దాల్చడాన్ని లేదా గర్భం నిలవడాన్ని ప్రభావితం చేయవచ్చు. ఇతర కారణాలనూ పరిశీలించిన తర్వాతే సంతానలేమి సమస్యకు ఫైబ్రాయిడ్ కారణమా కాదా అనేది నిర్ణయించాలి.

గర్భధారణ సమస్యలు

కొన్ని ఫైబ్రాయిడ్స్ గర్భస్రావం, శిశువు తలకిందులుగా కాకుండా ఇతర స్థితిలో ఉండటం, ముందస్తు ప్రసవం లేదా సిజేరియన్ అవసరం పెరగడం వంటివి జరగొచ్చు. అయితే, ఫైబ్రాయిడ్స్ ఉన్న చాలామంది మహిళలు ఆరోగ్యకరమైన గర్భధారణ, ప్రసవాన్ని పూర్తి చేస్తారు.

మూత్రాశయం, పేగులపై ఒత్తిడి

పెద్ద ఫైబ్రాయిడ్స్ మూత్రాశయంపై ఒత్తిడి కలిగించి తరచూ మూత్రవిసర్జనకు కారణమవుతాయి. పేగులపై ఒత్తిడి వల్ల మలబద్ధకం రావచ్చు.

తీవ్రమైన నొప్పి

కొన్ని సందర్భాల్లో ఫైబ్రాయిడ్‌లో రక్తప్రసరణ మార్పులు లేదా దాని కాడ మెలితిరగడం వల్ల తీవ్రమైన నొప్పి రావచ్చు. ఆకస్మికంగా తీవ్రమైన కడుపునొప్పి, జ్వరం లేదా వాంతులు ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

మానసిక, సామాజిక ప్రభావం

అధిక రక్తస్రావం, నొప్పి, గర్భధారణపై ఆందోళన కారణంగా కొందరు మహిళల్లో నిద్రలేమి, ఆందోళన, పనితీరు తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి.

ఫైబ్రాయిడ్స్ క్యాన్సర్‌గా మారతాయా?

సాధారణ గర్భాశయ ఫైబ్రాయిడ్స్ అనేవి క్యాన్సర్ కాని గడ్డలు. ఇవి సాధారణంగా క్యాన్సర్‌గా మారవు. గర్భాశయంలో ఏర్పడే లియోమయోసార్కోమా (Leiomyosarcoma) అనే అరుదైన క్యాన్సర్ అనేది వేరే వ్యాధి. ఇది ఫైబ్రాయిడ్స్ నుంచి ఏర్పడదు. వేగంగా పెరుగుతున్న గడ్డ ఉన్నంత మాత్రాన క్యాన్సర్ అని నిర్ధరించలేం. అయితే, మెనోపాజ్ తర్వాత రక్తస్రావం లేదా గడ్డ పెరుగుదల కనిపిస్తే తప్పనిసరిగా పరీక్ష చేయించుకోవాలి.

ఫైబ్రాయిడ్స్‌ను ఎలా గుర్తిస్తారు?

ఫైబ్రాయిడ్స్ నిర్ధరణకు వైద్యులు మహిళకు ఉన్న లక్షణాలు, నెలసరి చరిత్ర, కుటుంబ చరిత్రను తెలుసుకుంటారు. అవసరాన్నిబట్టి కొన్ని రకాల పరీక్షలు సూచిస్తారు.

అల్ట్రాసౌండ్ స్కాన్

ఫైబ్రాయిడ్ పరిమాణం, సంఖ్య, గర్భాశయంలో దాని స్థానం తెలుసుకోవడానికి దీన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. పొత్తి కడుపుపై నుంచి లేదా యోని మార్గం ద్వారా ఈ పరీక్ష చేయవచ్చు.

రక్త పరీక్షలు

అధిక రక్తస్రావం ఉన్నప్పుడు హిమోగ్లోబిన్, అవసరమైతే ఐరన్ నిల్వలను పరీక్షిస్తారు.

ఎంఆర్ఐ స్కాన్

పెద్ద గడ్డలు, క్లిష్టమైన పరిస్థితులు లేదా ప్రత్యేక చికిత్స చేయాల్సిన సందర్భాల్లో ఉపయోగపడుతుంది.

హిస్టెరోస్కోపీ

గర్భాశయం లోపలి కుహరాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికి ఉపయోగిస్తారు. లోపలి భాగంలో ఉన్న కొన్ని ఫైబ్రాయిడ్స్‌ను తొలగించడానికి కూడా ఈ విధానం ఉపయోగపడుతుంది. ప్రతి మహిళకూ అన్ని పరీక్షలూ అవసరం ఉండవు. లక్షణాలు, స్కాన్ ఫలితాలను బట్టి ఏవి అవసరమో వైద్యులు నిర్ణయిస్తారు.

ఫైబ్రాయిడ్స్‌కు చికిత్స ఎలా చేస్తారు?

ఫైబ్రాయిడ్ ఉందని తెలిసిన వెంటనే ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు. లక్షణాలు లేని చిన్న ఫైబ్రాయిడ్స్‌కు క్రమానుగత పర్యవేక్షణ సరిపోవచ్చు. లక్షణాలు, గడ్డ స్థానం, పరిమాణం, వయసు, భవిష్యత్తులో పిల్లలు కావాలనే కోరికను బట్టి చికిత్సను ఎంపిక చేస్తారు.

1. మందులతో చికిత్స

అధిక రక్తస్రావాన్ని తగ్గించే మందులు నెలసరి సమయంలో రక్తస్రావాన్ని తగ్గించవచ్చు. కొన్ని నొప్పి నివారణ మందులు నెలసరి నొప్పిని తగ్గిస్తాయి. కొన్ని హార్మోన్ల మందులు లేదా ప్రొజెస్టిరాన్‌ను విడుదల చేసే గర్భాశయ అంతర్గత పరికరం (హార్మోనల్ ఐ యూడీ – intra uterine device) అధిక రక్తస్రావాన్ని తగ్గించడంలో ఉపయోగపడవచ్చు. గర్భాశయ కుహరం ఆకృతిని మార్చే ఫైబ్రాయిడ్స్ ఉన్నవారిలో ఈ పరికరం అందరికీ అనుకూలం కాకపోవచ్చు. కొన్ని ప్రత్యేక హార్మోన్ల మందులు ఫైబ్రాయిడ్ పరిమాణాన్ని తాత్కాలికంగా తగ్గించవచ్చు. వీటిని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ముఖ్యంగా శస్త్రచికిత్సకు ముందు, వైద్య పర్యవేక్షణలో ఉపయోగిస్తారు. దుష్ప్రభావాలు ఉండే అవకాశం ఉన్నందున స్వయంగా వీటిని వాడకూడదు. మందులతో ఈ లక్షణాలు నియంత్రణలోకి రావచ్చు. అయితే, అన్ని మందులూ ఫైబ్రాయిడ్‌ను పూర్తిగా తొలగించవు.

2. మయోమెక్టమీ (Myomectomy)

ఈ శస్త్రచికిత్సలో గర్భాశయాన్ని తొలగించకుండా ఫైబ్రాయిడ్స్‌ను మాత్రమే తొలగిస్తారు. భవిష్యత్తులో పిల్లలు కావాలనుకునే మహిళలకు, తగిన పరిస్థితుల్లో, ఇది ముఖ్యమైన చికిత్సా విధానం. గర్భాశయం లోపలికి పెరిగిన కొన్ని ఫైబ్రాయిడ్స్‌ను హిస్టెరోస్కోపీ ద్వారా తొలగించవచ్చు. కొన్ని గడ్డలను లాపరోస్కోపీ ద్వారా తొలగించవచ్చు. పెద్దవి లేదా అనేక గడ్డలు ఉన్నప్పుడు పొత్తికడుపు ద్వారా శస్త్రచికిత్స అవసరం కావచ్చు. ఈ చికిత్స తర్వాత కూడా కొత్త ఫైబ్రాయిడ్స్ ఏర్పడే అవకాశం ఉంటుంది. గర్భాశయంపై చేసిన శస్త్రచికిత్స ఆధారంగా భవిష్యత్తులో ప్రెగ్నెన్సీ, ప్రసవ విధానంపై ప్రత్యేక సూచనలు అవసరం కావచ్చు.

3. హిస్టరెక్టమీ (Hysterectomy)

ఈ శస్త్రచికిత్సలో గర్భాశయాన్ని తొలగిస్తారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నప్పుడు, ఇతర చికిత్సలు ఫలించనప్పుడు లేదా తగిన ఇతర మార్గాలు అందుబాటులో లేనప్పుడు దీనిని పరిగణించవచ్చు. గర్భాశయాన్ని తొలగించిన తర్వాత గర్భం దాల్చడం సాధ్యం కాదు. అందువల్ల భవిష్యత్తులో పిల్లలు కావాలనే కోరిక, ఇతర చికిత్సల ప్రయోజనాలు, ప్రమాదాలను పూర్తిగా చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోవాలి. గర్భాశయాన్ని తొలగించేటప్పుడు అండాశయాలనూ తప్పనిసరిగా తొలగించాల్సిన అవసరం లేదు.

4. యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (UAE)

ఈ విధానంలో గర్భాశయానికి, ఫైబ్రాయిడ్‌కు రక్తాన్ని సరఫరా చేసే కొన్ని రక్తనాళాలను ప్రత్యేక పద్ధతిలో మూసివేస్తారు. దీంతో ఫైబ్రాయిడ్ క్రమంగా చిన్నదవుతుంది. దీని వలన కొందరు మహిళల్లో రక్తస్రావం, నొప్పి వంటి లక్షణాలు తగ్గుతాయి. అయితే, భవిష్యత్తులో ప్రెగ్నెన్సీ కావాలనుకునే మహిళల్లో దీని ప్రభావాలు, ప్రమాదాలను ప్రత్యేకంగా చర్చించాలి. ఇది అందరికీ సరిపోయే చికిత్స కాదు.

5. ఇతర ఆధునిక చికిత్సలు

రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (Radiofrequency Ablation) వంటి విధానాల్లో వేడి శక్తిని ఉపయోగించి ఫైబ్రాయిడ్ కణజాలాన్ని దెబ్బతీస్తారు.

ఫైబ్రాయిడ్స్ ఉంటే గర్భం దాల్చవచ్చా?

ఫైబ్రాయిడ్స్ ఉన్న చాలామంది మహిళలు సహజంగానే గర్భం దాల్చి ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మనిస్తారు. కాబట్టి ఫైబ్రాయిడ్ ఉందని నిరాశ చెందాల్సిన అవసరం లేదు. అయితే, గర్భాశయ లోపలి కుహరాన్ని మార్చే ఫైబ్రాయిడ్స్... గర్భం దాల్చడాన్ని ప్రభావితం చేయవచ్చు. గర్భం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు సంతానలేమికి సంబంధించిన ఇతర కారణాలనూ పరిశీలించాలి. అవసరమైతే గైనకాలజిస్ట్, సంతాన సాఫల్య నిపుణులు కలిసి చికిత్సను నిర్ణయిస్తారు. గర్భధారణకు ముందు ఫైబ్రాయిడ్ తొలగించాలా వద్దా అనే నిర్ణయం కేవలం దాని పరిమాణం ఆధారంగా తీసుకోరు. ఫైబ్రాయిడ్స్ ఉన్న స్థానం, లక్షణాలు, గత ప్రెగ్నెన్సీ చరిత్ర, సంతానలేమి వంటి వివరాలు కూడా ముఖ్యమే.

ఎప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి?

★గంటలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్యాడ్లు పూర్తిగా తడిసిపోయేంత రక్తస్రావం వరుసగా కొనసాగడం, ముఖ్యంగా తల తిరగడం లేదా నీరసం
★ఆకస్మికంగా తీవ్రమైన కడుపునొప్పి
★అధిక రక్తస్రావంతో పాటు మూర్ఛ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తీవ్రమైన బలహీనత
★గర్భధారణ సమయంలో కడుపునొప్పి లేదా రక్తస్రావం
★మెనోపాజ్ తర్వాత యోని నుంచి రక్తస్రావం

ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

ఫైబ్రాయిడ్స్ నివారణ సాధ్యమేనా?

ఫైబ్రాయిడ్స్ ఏర్పడకుండా పూర్తిగా నివారించే నిరూపితమైన పద్ధతి ప్రస్తుతం లేదు. అయినప్పటికీ, ఆరోగ్యకరమైన బరువును మేనేజ్ చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అధిక రక్తస్రావం ఉంటే ఐరన్ లోపం ఉందో లేదో పరీక్షించుకోవాలి. వైద్యుల సలహా లేకుండా హార్మోన్ల మందులు లేదా ఇంటి చిట్కాలపై ఆధారపడకూడదు. గర్భాశయ ఫైబ్రాయిడ్స్ సాధారణమైనవే అయినప్పటికీ, వాటి వల్ల వచ్చే లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రతి ఫైబ్రాయిడ్‌కీ శస్త్రచికిత్స అవసరం లేదు. అదే సమయంలో అధిక రక్తస్రావం, రక్తహీనత, తీవ్రమైన నొప్పి లేదా సంతాన సమస్యలు ఉంటే చికిత్సను వాయిదా వేయకూడదు. ఆధునిక వైద్య విధానాలతో అనేక చికిత్సా మార్గాలు అందుబాటులో ఉన్నాయి. సరైన సమయంలో గైనకాలజిస్టును సంప్రదించి, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సను ఎంచుకోవడం ఉత్తమం.

జలుబు ఉన్నప్పుడు ఎక్సర్‌సైజ్ చేయచ్చా..



వర్షాకాలం, చలికాలంలో చాలా మంది జలుబు, జ్వరం వంటి సమస్యలతో బాధపడుతుంటారు. అయితే, ఈ టైమ్‌లో మనం మన రెగ్యులర్ వర్కౌట్ రొటీన్‌ని స్కిప్ చేయాల్సిన అవసరం లేదని అనుకుంటాం. కానీ, ఇదే విషయంలో రీసెంట్‌గా పబ్లిష్ అయిన ఓ అధ్యయనం కొన్ని ముఖ్య సూచనలు చేస్తోంది. అందులో జలుబు ఉన్నప్పుడు వర్కౌట్ చేయాలనుకుంటే కొన్ని విషయాలను ఫాలో అవ్వాలని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూనే అసలు తిరిగి మన బాడీ ఆరోగ్యంగా మారడానికి ఎంత టైమ్ తీసుకుంటుందో కూడా చెబుతోంది. అంతేకాకుండా, జలుబు ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి పెరగకుండా ఉండేందుకు ఏం చేయాలనే ముఖ్య విషయాల గురించి చెబుతోంది. ఇదే విషయంపై డాక్టర్ కె.శశి కిరణ్(సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్) మరికొన్ని ముఖ్య విషయాలు చెబుతున్నారు.

పరిశోధనలో శాస్త్రవేత్తలు క్రీడాకారులలో నిర్ధారించిన 114 శ్వాసకోశ ఇన్ఫెక్షన్స్‌పై పరిశోదన చేశారు. అందులో తేలినదేంటంటే లక్షణాలు ప్రారంభమైన వెంటనే సమస్యని గుర్తించలేం. వ్యాధి తీవ్రతని బట్టి మూడు రోజుల నుంచి 11 రోజుల వరకూ సమయం పడుతుంది. కాబట్టి, మనం సమస్య చిన్నదే అని నెగ్లెక్ట్ చేయడం సరికాదు. ఈ టైమ్‌లో వర్కౌట్ సరిగ్గా చేస్తున్నామని చేసినంత మాత్రానా మీరు పూర్తిగా హెల్దీగా మారినట్లు కాదని చెబుతున్నారు.

జలుబు, ఫ్లూ వంటి సమస్యలు

ఇక్కడ అన్నీ సమస్యలకి ఒకే సమయం పట్టదు. సాధారణంగా జలుబుకి ఓ సమయం పడుతుంది. ఫ్లూకి మరో సమయం పడుతుంది. ఇక మహమ్మారి వంటి సమస్యలకి మరింత సమయం పడుతుంది. జలుబు ఉన్నవారు త్వరగా కోలుకుంటారు. అలా కాకుండా తీవ్ర ఇన్ఫెక్షన్స్, లేదా అంతర్లీన ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగా ఏదైనా ఫ్లూ, ఇతర ఇన్ఫెక్షన్స్ వంటివి సాధారణంగా జలుబుతోనే ప్రారంభమవుతాయి. కాబట్టి, మనం సమస్య ఏంటో గుర్తించేవరకూ జలుబు ఉన్నా కూడా వర్కౌట్స్ చేస్తాననుకోవడం సరికాదు. ఎందుకంటే అన్నీ లక్షణాలు మొదటగా ఒకేలా ఉంటాయి.

ఎప్పుడు వర్కౌట్ చేయొచ్చు

పరిశోధకులు ఇదే విషయం గురించి ఓ క్లియర్ విషయాన్ని చెబుతున్నారు. అదేంటంటే ముక్కుదిబ్బడ, తుమ్ములు, తేలికపాటి గొంతు నొప్పి వంటి లక్షణాలన్నీ మనకి మెడకి పైభాగంలో ఉంటాయి. అలాంటప్పుడు వర్కౌట్ చేయొచ్చు. కానీ, అవే మనకి ఛాతీ వరకూ చేరాయనిపించినప్పుడు వర్కౌట్ చేయడమే మానేయాలి.

ఎలాంటి లక్షణాలని నెగ్లెక్ట్ చేయొద్దు

సాధారణంగా జలుబు ఉంటే కాస్తా పర్లేదు. కానీ, అది జ్వరం, అలసట, తలతిరగడం, గుండె దడ, తీవ్రంగా అనారోగ్యంగా అనిపించడం వంటివన్నీసమస్య తీవ్రతని చూపించేవే. కాబట్టి, వీటిని ఏ మాత్రం నెగ్లెక్ట్ చేయొద్దు. కొద్దిగా వర్కౌట్ చేసినా ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వర్కౌట్ ఆపేయాలి. అంతేకానీ, వీటిని నెగ్లెక్ట్ చేసి పూర్తి వర్కౌట్ కంప్లీట్ చేయాలని అనుకోవద్దు. మీకు జ్వరం, బాడీపెయిన్స్, బలహీనత, ఛాతీనొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది వంటివన్నీ ఉన్నప్పటికీ మిమ్మల్ని మీరు చెక్ చేసుకోవడానికి వర్కౌట్ చేయొద్దు.

CDC చెబుతోందేంటి?

మీకు శ్వాసకోశ వైరస్ లక్షణాలు ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండాలి, ఇతరులకి దూరంగా ఉండాలని CDC సలహా ఇస్తోంది. మీకు ఎలాంటి లక్షణాలు లేకుండా జ్వరం తగ్గించే మందులు కూడా వాడకుండా మీ పనులు మీరు చేసుకుంటే 24 గంటల తర్వాత అప్పుడు రోజువారీ పనులు చేసుకోవచ్చు. అప్పుడు కూడా వేరేవారిని కలవకుండా మీ పనులు మీరు మాత్రమే చేసుకోవాలి. ఎందుకంటే మీరు కోలుకున్నాక కూడా ఇతరులకి వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మరో ఐదురోజుల పాటు ఎక్స్‌ట్రా కేర్ అవసరమంటోంది CDC. అలాంటప్పుడు ఇంట్లోనే ఏవో చిన్న చిన్న వర్కౌట్స్ చేయొచ్చు. అంతేకానీ, జిమ్‌కి వెళ్ళడం సరికాదు.

పూర్తి వర్కౌట్ ఎప్పుడు చేయాలి?

మీరు కోలుకున్నట్లుగా అనిపించినప్పుడు తిరిగి మళ్ళీ వర్కౌట్ చేసినప్పుడు 10 నుంచి 20 నిమిషాల వర్కౌట్ చేసినా మీకు ఎలాంటి సమస్యగా అనిపిస్తే అప్పుడు మెల్లిమెల్లిగా సమయాన్ని పెంచుకుంటూ పోండి అంతేకానీ, ఒకేసారి మొత్తం వర్కౌట్ చేయాల్సిన అవసరం లేదు. అలానే వర్కౌట్ ప్రారంభించి పూర్తిస్థాయిగా వర్కౌట్ చేయడానికి కనీసం వారం టైమ్ పడుతుంది. ఇది గమనించాలి. ఒకేసారి ఎక్కువగా వర్కౌట్స్ చేద్దామనుకోవద్దు. కొద్దిగా జలుబు తగ్గుతున్నప్పుడు పూర్తిగా కదలకుండా ఉండాల్సిన అవసరం లేదు. అలా అని హెవీ వర్కౌట్స్ చేయాల్సిన అవసరం లేదు. మీరు కోలుకున్న తర్వాత మెల్లిమెల్లిగా బాడీకి పనులు అప్పజెప్పాలి. అంతేకానీ, ఒకే సారి వర్కౌట్ చేయడం, అందరినీ కలవడం వంటివి చేయొద్దు. కాస్తా సమయం తీసుకుంటూ పనులు చేసుకోవడం ఉత్తమం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 31.10.2026
www.mudranews.in | @mudranews

పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి

అరటిపండులో ఉండే పీచు పదార్థాలు, ముఖ్యంగా పచ్చి అరటిపండులోని రెసిస్టెంట్ స్టార్చ్, పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు తోడ్పడతాయి. తద్వారా గట్ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్ అభివృద్ధి

నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో భారీ ప్రణాళిక
మూసీ పునరుజ్జీవనానికి తొలి దశలో రూ.7,500 కోట్లు
30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం
నారెడ్కో ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్‌ను ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతోపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర కీలకమని, ఈ రంగాల ప్రతినిధులను కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లు హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణ రూపొందించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల విలువైన పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టామని, పలు పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. హెచ్ఎండీఏ, గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాలకు రూ.52,706 కోట్లు, జలమండలికి రూ.15,849 కోట్లు కేటాయించినట్లు వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ పరిధిలో రూ.2,163 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.మూసీకి కొత్త రూపుమూసీ నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్ది హైదరాబాద్‌కు ప్రత్యేక ఆకర్షణగా మార్చాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో రూ.7,500 కోట్ల పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామని, భవిష్యత్తులో వీటి సంఖ్యను 38కి పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఉద్యానవనాలకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీభారత్ ఫ్యూచర్ సిటీని 30 వేల ఎకరాల్లో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, బహిరంగ ప్రదేశాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. మొత్తం విస్తీర్ణంలో 50 శాతం హరిత ప్రాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని ధీమా వ్యక్తం చేశారు.కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలుహైదరాబాద్‌ను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం, డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడం, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చేందుకు రాయితీలు అందించడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రూ.93 వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యంరాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం, అర్హులకు రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.నిర్మాణ రంగానికి నైపుణ్య యువతనిర్మాణ, పారిశ్రామిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.నగరంలో విలాసవంతమైన గృహాలతోపాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణంపై కూడా రియల్ ఎస్టేట్ సంస్థలు దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధిలో నిర్మాణ రంగం కీలక భాగస్వామిగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ పథకాల సమన్వయంతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఉద్యోగాల ఎర..

లక్షలు కాజేసిన కేటుగాళ్లను అరెస్ట్ చేసిన కేపీహెచ్‌బీ పోలీసులు

ముద్ర, హైదరాబాద్ :విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అమాయక నిరుద్యోగులకు వల వేసి లక్షల రూపాయలు కాజేస్తున్న ఘరానా మోసాన్ని కేపీహెచ్‌బీ పోలీసులు రట్టు చేశారు. మలేషియాలో డేటా ఎంట్రీ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి విదేశాల్లో నరకం చూపించిన 'బెల్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్' కన్సల్టెన్సీకి చెందిన నిందితులు బల్లె నరేష్, జగవీర పిల్లెలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడు బల్లె నరేష్, బాధితుడైన బాలగంగాధర రావుకు పరిచయమయ్యాడు.మలేషియాలో నెలకు మంచి వేతనంతో కూడిన ఉద్యోగం ఉందని నమ్మించి, కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలోని మంజీర ట్రినిటీ భవనంలో ఉన్న తమ కార్యాలయానికి పిలిపించుకున్నారు. అక్కడ కొన్ని ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకుని, విడతల వారీగా రూ.2.42 లక్షలు వసూలు చేశారు. అనంతరం బాధితుడిని మలేషియా పంపించిన నిర్వాహకులు, అక్కడ అతడిని ఎవరూ రిసీవ్ చేసుకోకుండా గాలికొదిలేశారు.అక్కడి స్థానిక ఏజెంట్లు అతడి వద్ద నుంచి పాస్‌పోర్ట్ లాక్కుని, సింగపూర్ వెళ్లాలని బెదిరించడమే కాకుండా, స్వదేశానికి తిరిగి రావాలంటే మరో రూ.3 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. విదేశంలో నరకం చూసిన బాధితుడు ఏపీఎన్ఆర్‌టీఎస్ సంస్థను ఆశ్రయించి, వారి చొరవతో సురక్షితంగా ఇండియాకు చేరుకున్నాడు. హైదరాబాద్ చేరుకున్న అనంతరం బాధితుడు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.విచారణ చేపట్టిన పోలీసులు, ఇదే కన్సల్టెన్సీ మరొకరి వద్ద నుంచి కూడా రూ.1.80 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ విదేశీ ఉద్యోగ ప్రకటనలను నమ్మి మోసపోవద్దని పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

రూ.12వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం

ర్యాలీని వాయిదా వేయండి.. సోనియా గాంధీని కోరిన ఢిల్లీ వ్యాపారులు

ముద్ర, న్యూఢిల్లీ: నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఎత్తును కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించనున్నది. ఆ ర్యాలీలో సుమారు 10 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. అయితే ఆ ర్యాలీని వాయిదా వేయాలని ఢిల్లీ వ్యాపారులు(Delhi Traders) ఇవాళ కాంగ్రెస్ నేత సోనియా గాంధీని వేడుకున్నారు. దీపావళి సీజన్ షాపింగ్ జరుగుతోంది కాబట్టి , ర్యాలీ వల్ల సుమారు 12వేల కోట్ల వ్యాపారంపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకే ఆ ప్రతిపాదిత ర్యాలీని వాయిదా వేసుకోవాలని సోనియాను ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ కోరింది. ఢిల్లీలో ఆందోళనలు చేయడం వల్ల సుమారు 20 కీలక మార్కెట్లకు నష్టం జరిగే ఛాన్సు ఉన్నట్లు వాణిజ్య సంఘాలు తెలిపాయి. నవంబర్ 11 తర్వాత ర్యాలీ నిర్వహించుకోవాలని, లేదంటే బురారీ గ్రౌండ్‌కు మార్చుకోవాలని వ్యాపారులు కోరారు. రామ్‌లీలా మైదానంలో ర్యాలీ వల్ల పార్కింగ్ సమస్యలు వస్తాయని, దీంతో సుమారు 20 లక్షల మంది వ్యాపారులపై వత్తిడి ఉంటుందని సీటీఐ తన అభ్యర్ధనలో పేర్కొన్నది. రామ్‌లీలా మైదానంలో 20 వేల వాహనాలను పార్క్ చేసేంత సామర్థ్యం లేదని, కనీసం 200 పెద్ద బస్సులను అక్కడ ఆపలేమని వ్యాపారులు తెలిపారు. మైదానానికి 5 కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 20 అతిపెద్ద మార్కెట్లు ఉన్నాయని, పండుగ సీజన్ వేళ ఆ మార్కెట్లలో జరిగే సుమారు 12వేల కోట్ల వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెప్పారు.

ఇంట్లో దాచిన డ్రమ్ముల్లో కోట్లలో డబ్బు

ముద్ర, లక్నో: అన్నాదమ్ముల జీవనశైలిలో ఆకస్మిక మార్పు చూసి గ్రామస్తులు నోరెళ్లబెట్టారు. వారిద్దరూ ఎకరాల కొద్దీ భూములు, ట్రాక్టర్ కొనుగోలు చేయడం, విలాసవంతంగా డబ్బు ఖర్చు చేయడంపై ఆశ్చర్యపోయారు. బ్లాక్ మనీపై సమాచారం అందుకున్న పోలీసులు ఆ సోదరుల ఇంట్లో తనిఖీ చేశారు. భూమిలో పాతిన మూడు డ్రమ్ముల్లో కోట్ల డబ్బు ఉండటం చూసి షాక్ అయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రామ్‌నగర్ గ్రామంలోని బరైపూర్‌కు చెందిన సోదరులైన రాకేష్ యాదవ్, రాజేష్ యాదవ్ గతంలో పూణేలో పనిచేశారు. 2020లో కరోనా మహమ్మారి సమయంలో వారిద్దరూ తమ ఉద్యోగాలు వదిలేసి గ్రామానికి తిరిగి వచ్చారు. చాలా తక్కువ కాలంలోనే ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ భూములను వారు కొనుగోలు చేశారు. విలాసవంతంగా డబ్బు ఖర్చు చేయడం మొదలుపెట్టారు. సాధారణ ఉద్యోగాలు చేసే అన్నాదమ్ములు ఇంత ధనవంతులుగా ఎలా మారారో తెలియక గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. మరోవైపు ఇటీవల ఈ సోదరులు, గ్రామస్తుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో వారి వద్ద పెద్ద మొత్తంలో నల్లధనం ఉన్నట్లు స్థానిక వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో నవాబ్‌గంజ్, సోరాన్ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ బృందాలు అక్టోబర్ 28న ఆ సోదరుల ఇంట్లో సోదాలు చేశారు. ఇంటిలోని ఒక గది నేలను పోలీసులు పరిశీలించారు. అక్కడ ఇటీవల మట్టి తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. కూలీలను పిలిచి తవ్వకాలు చేపట్టారు. భూమిలో పాతిన మూడు డ్రమ్ములు బయటపడ్డాయి. మందపాటి నల్ల ప్లాస్టిక్ షీట్లతో చుట్టి ఉన్న ఆ డ్రమ్ములను తెరిచి చూడగా రూ.500 నోట్ల కట్టలు బయటపడ్డాయి. కోట్లలో ఉన్న ఆ డబ్బును చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంటిని పోలీసులు సీజ్ చేశారు. ఆదాయపు పన్ను శాఖ, ఇతర ఆర్థిక దర్యాప్తు సంస్థలకు ఈ విషయాన్ని తెలియజేసినట్లు గంగానగర్ డీసీపీ సోనం కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల్లో ఒకరిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో అన్నది అతడ్ని ప్రశ్నిస్తున్నట్లు వివరించారు.

ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో కలకలం

నూతన అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్‌ను అదుపులోకి తీసుకున్న సీఐడీ అధికారులు
అసోసియేషన్ అధ్యక్షుడి వ్యవహారంతో జిల్లాలో చర్చ..
గత కేసు దర్యాప్తులో భాగంగానే చర్యలా?
అధికారిక వివరాలపై ఉత్కంఠ!

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 30: ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాట్రగడ్డ సతీష్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం వెలువడటంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అసోసియేషన్‌లో కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం సభ్యుల్లో ఆందోళనకు దారితీసింది.ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం, గతంలో నమోదైన ఓ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సతీష్‌పై చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే అసలు కేసు ఏమిటి? ఆ కేసులో ఆయన పాత్ర ఏమిటి? ఏ కారణాలతో అధికారులు అదుపులోకి తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.మరోవైపు, ఈ పరిణామం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవిష్యత్ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపనుందన్న చర్చ కూడా మొదలైంది. అధ్యక్షుడి వ్యవహారంపై అసోసియేషన్ సభ్యులు, మిల్లర్లలో ఆసక్తి నెలకొంది.అసలు కేసు ఏమిటి? దర్యాప్తులో వెలుగులోకి రానున్న అంశాలేమిటి?సతీష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వస్తున్న సమాచారంపై సీఐడీ అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అదుపులోకి తీసుకోవడం, అరెస్టు చేయడం రెండూ వేర్వేరు న్యాయపరమైన ప్రక్రియలు కావడంతో తదుపరి అధికారిక వివరాల కోసం వేచి చూడాల్సి ఉంది.సీఐడీ దర్యాప్తులో పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? అసోసియేషన్‌లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడేది ఎప్పుడు? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఐక్య ఉద్యమం చేపట్టాలి

ముద్ర, వనపర్తి: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు సంఘటిత పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. శుక్రవారం రేవల్లి మండల కేంద్రంలో వనపర్తి జిల్లా టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు.వనపర్తి జిల్లాలో 409 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇప్పించడంలో జిల్లా కమిటీ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల కేంద్రాల్లో ప్రెస్ క్లబ్బుల ఏర్పాటుకు కూడా యూనియన్ ప్రయత్నిస్తోందన్నారు.ఈ సమావేశంలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నిస్తూ వృత్తి విలువలను కాపాడుకోవాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎన్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రాజు, కోశాధికారి మన్యం,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు అంజి.. సీనియర్ జర్నలిస్ట్ నాగేంద్రంచారి, శ్రీనివాస్ రావు, వనపర్తి పట్టణ యూనియన్ అధ్యక్షుడు తైలం అరుణ్,పెబ్బేర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్,శ్రీరంగాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజు,రేవల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు హరీష్, కార్యదర్శి నవీన్, గణేష్, రామకృష్ణ, దామోదర్, రవీందర్ శేఖర్, శ్రీనివాసులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చించారు.

ఢిల్లీ మహా ర్యాలీకి కూకట్‌పల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణుల పయనం

జెండా ఊపి ప్రారంభించిన బండి రమేష్

ముద్ర, కూకట్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ మహా ర్యాలీ' నిర్వహించనున్నారు.అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి మద్దతుగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి బయలుదేరారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ జెండా ఊపి ఈ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యకర్తలను ఘనంగా సాగనంపి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... "ప్రజాస్వామ్యంలో పౌరుల ఓటు హక్కు అత్యంత విలువైనది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. ఓటర్ల హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలి" అని పిలుపునిచ్చారు.

సికింద్రాబాద్‌లో అంతర్ రైల్వే మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

13 జట్లు.. నవంబర్ 4 వరకు ఛాంపియన్‌షిప్

ముద్ర, సికింద్రాబాద్: 49వ అఖిల భారత అంతర్ రైల్వే మహిళల బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 4 వరకు జరిగే ఈ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వేతో సహా మొత్తం 13 జట్లు పాల్గొంటున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణతో తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. గత ఏడాది విజేతగా నిలిచిన దక్షిణ మధ్య రైల్వే జట్టు ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నగర రవాణా భవిష్యత్తుకు 'సైబరాబాద్ మూవ్స్–2026'

నవంబర్ 26 నుంచి టీ-హబ్‌లో మూడు రోజుల ప్రదర్శన

ముద్ర, సైబరాబాద్: నగరంలో సురక్షిత, సమ్మిళిత, పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేసే లక్ష్యంతో నవంబర్ 26, 27, 28 తేదీల్లో 'సైబరాబాద్ మూవ్స్–2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. టీ–హబ్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్ తదితర సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ మాట్లాడుతూ రహదారి భద్రత, ప్రజలకు సులభమైన ప్రయాణ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జి. సృజన మాట్లాడుతూ ట్రాఫిక్ జంక్షన్ల అభివృద్ధి, రహదారుల మెరుగుదల, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో నగర రవాణాకు సంబంధించిన మ్యాపులు, సమాచార ప్రదర్శనలు, నిపుణుల చర్చలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. విద్యార్థులు, పౌరుల కోసం మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌ను కూడా చేపట్టనున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెరుగైన రవాణా పరిష్కారాల రూపకల్పనకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 31.10.2026
www.mudranews.in | @mudranews

గుండె కండరాల పనితీరుకు తోడ్పాటు!

అరటిపండులోని పొటాషియం కండరాల సంకోచం, నాడీ సంకేతాల ప్రసారంలో కీలక పాత్ర పోషిస్తుంది. గుండె సాధారణ పనితీరుకు కూడా ఇది అవసరం.



పాలకుల నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ వెనుకబాటు

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కవిత విమర్శలు

ముద్ర ప్రతినిధి, ఆదిలాబాద్: గోదావరి, ప్రాణహిత నదులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు సాగునీరు అందడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదిలాబాద్ లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు నీరందేదన్నారు. చనఖా–కొరటా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.368 కోట్ల నుంచి రూ.2,100 కోట్లకు పెంచడంపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను పంటలు వేయవద్దని సూచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును తప్పుబట్టారు. ఆదివాసీల హక్కులు, రైతుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. పాంచజన్య కార్యాచరణలో భాగంగా మెరుగైన ఉచిత విద్య, వైద్యం, యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వ్యాపార రుణాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సామాజిక న్యాయానికి కట్టుబడి రెండు ఎమ్మెల్సీ స్థానాలకు బీసీ యువకులను అభ్యర్థులుగా ప్రకటించామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ప్రజల ఆశీర్వాదంతో కొత్త రాజకీయ మార్పు తీసుకొస్తామని కవిత అన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం: సీఎం చంద్రబాబు

ముద్ర ప్రతినిధి, నరసాపురం, అక్టోబర్ 30: అర్నబ్ తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు పర్యటించిన ఆయన పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు, నరసాపురం మండలాల్లో పంట నష్టాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. రైతులకు పంట నష్టపరిహారం అందిస్తామని, గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకుపైగా విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు. ప్రాథమికంగా రూ.4,600 కోట్ల నష్టం అంచనా వేసినట్లు వెల్లడించారు. షెల్టర్లలోని బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జర్మనీతో తెలంగాణ బంధం బలోపేతం కావాలి

ముద్ర, హైదరాబాద్ : భారత్–జర్మనీ మధ్య 75 ఏళ్ల స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జర్మన్ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జర్మన్ కంపెనీలను ఆహ్వానించారు. ఐటీ, ఆటోమొబైల్, అధునాతన తయారీ, పర్యాటక రంగాల్లో అపార అవకాశాలున్నాయని తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025–2030 ద్వారా ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, ఐదు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడి అవకాశాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయంలో OCTOPUS ఆపరేషనల్ మాక్ డ్రిల్

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో భద్రతా సంసిద్ధతను అంచనా వేసేందుకు శుక్రవారం OCTOPUS ఆధ్వర్యంలో ఆపరేషనల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. OCTOPUS ఎకో SWAT టీమ్ SOC/DSP బి. మరియ దాసు నాయకత్వంలో జరిగిన ఈ విన్యాసంలో పోలీస్, అగ్నిమాపక, ట్రాఫిక్, వైద్య, బాంబ్ డిస్పోజల్ తదితర విభాగాలకు చెందిన 130 మంది సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం, భద్రతా వ్యవస్థల పనితీరు, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం ఈ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. సచివాలయ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఇలాంటి విన్యాసాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

మియాపూర్ భూములను అమ్మేందుకు కాంగ్రెస్ కుట్ర

- మాజీ మంత్రి హరీశ్ రావు

ముద్ర, హైదరాబాద్: మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేసి కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.60 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాలకు వినియోగించకుండా అమ్మాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు రికార్డులు పరిశీలిస్తే 2015 నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం స్పష్టమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూముల పరిరక్షణపై చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని విమర్శించారు.

బియ్యం అక్రమ నిల్వలపై సర్కార్ కొరడా

ముద్ర, హైదరాబాద్ : బియ్యం బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బీపీటీ బియ్యం కిలో ధరను రూ.66కు నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఐదు శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఇప్పటికే 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో బియ్యం నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు.

రూ.600 కోట్లతో ఇన్ఫోసిస్ కొత్త కేంద్రం ప్రారంభం

ముద్ర, హైదరాబాద్: హైదరాబాద్‌లోని పోచారం ప్రాంగణంలో ఇన్ఫోసిస్ సంస్థ రూ.600 కోట్ల పెట్టుబడితో నిర్మించిన నూతన సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ భవనంలో 10 వేల సీట్ల సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ ఐటీ సంస్థల పెట్టుబడులకు హైదరాబాద్ విశ్వసనీయ కేంద్రంగా ఎదుగుతోందని, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- నగరాభివృద్ధికి రూ.84,790 కోట్ల భారీ ప్రణాళిక
- మూసీ పునరుజ్జీవనంతో హైదరాబాద్‌కు కొత్త అందం
- ఫ్యూచర్ సిటీతో తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశ
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం: భట్టి విక్రమార్క
- నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ముద్ర, శేరిలింగంపల్లి : హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.

రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవనంతో నగరానికి కొత్త ఆభరణం

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు భారీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబా లకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 41 లక్షల కుటుంబాలకు చేయూత పథకం ద్వారా ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించేందుకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, అది తిరిగి వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులు

రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి తరగతులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించడం, శిక్షణ ఇచ్చే అధ్యాపకులను ఎంపిక చేయడం వంటి బాధ్యతలను పరిశ్రమల ప్రతినిధులకే అప్పగించినట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, నిర్మాణ రంగ సాంకేతికతలపై యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన యువతను ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నగరంలో లగ్జరీ గృహాలతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించే అంశంపై కూడా దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా నిర్మించిన ఎంఐజీ, ఎల్ఐజీ గృహాలు అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని గుర్తుచేశారు. అదే తరహాలో దీర్ఘకాలిక ప్రణాళికతో అందుబాటు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టికర్తలుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలు, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల సమన్వయంతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా, తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

రైతుల ఆదాయం, దిగుబడి పెంచేలా పరిశోధనలు జరగాలి

-కేంద్రమంత్రి బండి సంజయ్

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 30: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా వినూత్న పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త వంగడాలను అభివృద్ధి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–భారత వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్)లో నిర్వహించిన రైతు దినోత్సవం, పీఎం–కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యల పరిష్కారానికి పరిశోధనలు నిరంతరం కొనసాగించాలని అన్నారు. పర్యావరణం, మానవ ఆరోగ్యాన్ని కాపాడుతూ మెరుగైన సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. పీఎం–కిసాన్ పథకం రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ ప్రసాద్, శాస్త్రవేత్తలు, సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన వరి వంగడాలు, వ్యవసాయ ఆవిష్కరణలను ప్రదర్శించడంతో పాటు రైతులకు అవగాహన కల్పించారు.

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాలు!

- డిసెంబర్ 9 నాటికి ప్రక్రియ పూర్తి!
- సీఎం హామీ !

ముద్ర, హైదరాబాద్ : జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారు. ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులు, ఇతరుల ప్రభావాలకు తావులేకుండా కేవలం జర్నలిస్టుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ స్థలాల కేటాయింపు చేపడతామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని డిసెంబర్ 9వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని సీఎం హామీ ఇచ్చారు.జర్నలిస్టులకు అవసరమైన భూమిని అంచనా వేసి, 15 రోజుల్లోగా ఫ్యూచర్ సిటీ లేఅవుట్ సిద్ధం చేయాలని రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి సూచించారు.ఈ సందర్భంగా విలేకరుల సమక్షంలోనే ఆయన మంత్రితో మాట్లాడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్లాట్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ,ఇతర ప్రభావాలకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలని సీఎం ప్రతిపాదించారు. చిన్న పిల్లల చేతుల మీదుగా లక్కీ డ్రా (లాటరీ) నిర్వహించి అర్హులైన జర్నలిస్టులకు ప్లాట్లు కేటాయించే విధానాన్ని సూచించారు.ఈ ప్రక్రియకు తుది రూపు ఇచ్చేందుకు జర్నలిస్టులు వెంటనే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి అవసరమైన వివరాలు అందించాలని సీఎం సూచించారు.ఇతర వర్గాల నుంచి వచ్చే భూ కేటాయింపుల విజ్ఞప్తులను ప్రత్యేకంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై సీఎం సానుకూలంగా స్పందించడంతో జర్నలిస్టు వర్గాల్లో ఆశలు చిగురించాయి. రాబోయే 15 రోజుల్లో లేఅవుట్ రూపకల్పన, డిసెంబర్ 9 నాటికి ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం ఇప్పుడు కీలకంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 31.10.2026
www.mudranews.in | @mudranews

మెదడు ఆరోగ్యానికి మేలు

అరటిపండులోని విటమిన్ బి6 మెదడు పనితీరుకు, నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తికి అవసరమైన ప్రక్రియలకు కూడా సహాయపడుతుంది.

మియాపూర్ భూముల విజయం సీఎం కృషి ఫలితమే

మంత్రి పొంగులేటి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 30 : మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని రూ.35 వేల కోట్లకు పైగా విలువచేసే 550 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు సంచలన తీర్పునివ్వడంపై రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయం ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రమ, పట్టుదల ఫలితమేనని కొనియాడారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ విలువైన భూములను నమస్తే తెలంగాణ ఎండీ దామోదర్ రావుతో పాటు ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి కట్టబెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయని మంత్రి ఆరోపించారు. ఆ సమయంలో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ భూములను కాపాడేందుకు ఎంతో పోరాడారని, అనంతరం సీఎం అయ్యాక సుప్రీంకోర్టులో బలమైన న్యాయవాదులను నియమించి ప్రభుత్వం తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించారని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు గత పాలకుల దోపిడీకి చెంపపెట్టు లాంటిదని, ఈ విజయం ప్రజా ప్రభుత్వ నైతిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.కాళేశ్వరం పేరుతో గత పాలకులు లక్ష కోట్లు దోచుకున్నారని, ఆ సొమ్ములో కొంత భాగం కేటాయించి ఉంటే ఈరోజు రాష్ట్రంలో గుడిసెలే ఉండేవి కావు అని పొంగులేటి ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయాక బీఆర్ఎస్ నాయకులకు పేదలు గుర్తుకొస్తున్నారని, ప్రస్తుతం వారు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే రూ.40,000 కోట్ల వ్యయంతో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను రెండు విడతల్లో మంజూరు చేస్తున్నామని, అవసరమైతే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇచ్చేందుకు మూడు, నాలుగు విడతలు కూడా చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ పురపాలక అధ్యక్షులు భానోత్ కిషోర్ నాయక్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఏదులాపురాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మంలో కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి సింగరేణి కాలనీలో రూ. 4.96 కోట్లతో అంతర్గత సి.సి. రోడ్లు, రూ. 2.50 కోట్లతో బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 100 కోట్లకు పైగా నిధులు వెచ్చించామని, రాబోయే రోజుల్లో మరో రూ. 100 నుండి 150 కోట్లు ఖర్చు చేసి ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీతో పాటు అర్హులైన ప్రతి పేదవారికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని పేర్కొన్నారు.కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వారంలోనే రూ. 30 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక ఇంజనీరింగ్ అధికారులను డిప్యుటేషన్‌పై తెప్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వివిధ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సంఘం (సంఘబంధం) సమావేశం మరియు మహిళా సంఘాల సభ్యుల స్క్రీనింగ్ క్యాంపును జిల్లా కలెక్టర్ సందర్శించి, మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహాయం, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందిస్తోందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తమ నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా టైలరింగ్, కిరాణా దుకాణాలు, కంప్యూటర్ కేంద్రాలు, డ్రోన్ సేవలు, వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు తదితర స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (RSETI) ద్వారా మహిళలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, అర్హతను బట్టి స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు పొందేలా మార్గదర్శకత్వం కల్పిస్తామని తెలిపారు.అలాగే, మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్సీ) ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొందరి వైద్య పరీక్షల నివేదికలు ఆలస్యమైనప్పటికీ, త్వరలోనే సంబంధిత మహిళలందరికీ పూర్తి నివేదికలు అందజేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీపీఎం (ఐబీ), ఎంపీడీఓ, తాసిల్దార్, గ్రామ సర్పంచ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లో కాస్ట్ - నో కాస్ట్ పరికరాలతో సైన్స్ బోధన

జెవివి అవగాహన సదస్సు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 30: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రిక్కా బజార్ ఉన్నత పాఠశాలలో 2024 డిఎస్సీ ద్వారా ఎంపికైన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు "లో కాస్ట్ నో కాస్ట్" పరికరాలతో ప్రయోగాలు చేయడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేస్తూ నేర్చుకోవడం ద్వారా విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని పేర్కొన్నారు. .అనంతరం రిసోర్స్ పర్సన్లు కేవీకే శర్మ, కే. రామారావు, బి. హనుమ, ఈ. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు పలు ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపి, బోధనా మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ ప్రవీణ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి ఆర్. శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. శాంత, మాధవరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్, ప్రతినిధులు మోహన్, సూర్యనారాయణ, శ్రీరాములు, పి. రామకృష్ణ, టి. రామకృష్ణ, రాఘవయ్య, డాన్ బాస్కో తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి పిఎసిఎస్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి, హుస్నాబాద్, బస్వాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని భువనగిరి పిఎసిఎస్ చైర్మన్ పక్కిరు కొండల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ఎ.కృష్ణారెడ్డి, మాజీ ఏఎం సి చైర్మన్ రేఖ బాబూరావు, డైరెక్టర్లు గడ్డమీది వీరస్వామి రాసాలశ్రీశైలఓ, రాంపల్లి నరేష్, ఉదరి పాపమ్మ, సర్పంచ్ లు గోద శ్రీనివాస్, మచ్చ బిక్షపతి, కౌన్సిలర్ తుమ్మేటి పాండు యాదవ్, చిక్కుల వెంకటేశం, జిట్ట కృష్ణ రెడ్డి, హరినాథ్ యాదవ్, వల్లపు సత్తయ్య, ఎల్ ఏ టి ధర్మారెడ్డి, అశోక్, శ్రీశైలం, రవి, సంఘ సీఈవో ఏం రామలింగ చారి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాల సంస్కృతి ఎవరిదో ప్రజలకు తెలుసు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై సీపీఎం ఆరోపణలు అవాస్తవం

డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్

ముద్ర, ఖమ్మం, అక్టోబరు 30: జిల్లాలో హత్యా రాజకీయాల సంస్కృతి ఎవరిదో ప్రజలకు బాగా తెలుసని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై సీపీఎం నాయకులు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని ఖండించారు. శుక్రవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మధిర నియోజకవర్గంలో హత్యలు, ఘర్షణలతో అశాంతి నెలకొనేదని, భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత శాంతియుత వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన నాయకుడని కొనియాడారు.సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సామినేని రామారావు హత్య జరిగిన రోజున కొందరు ఉద్దేశపూర్వకంగా పాతర్లపాడు కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. ఈ హత్య కేసును శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో ఛేదించిన పోలీసులను అభినందించారు. పాతర్లపాడులో కాంగ్రెస్ నాయకులకు ప్రజాదరణ ఉందని, రామారావును హత్య చేయాల్సిన అవసరం వారికి లేదని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు నిరాధార ఆరోపణలు మానుకుని పోలీసు విచారణకు సహకరించాలని కోరారు.మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రామారావు హత్య వెనుక ఆర్థిక వ్యవహారాలు ఉండవచ్చని అభిప్రాయపడారు. కేసులో ఇప్పటికే కొందరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. వాస్తవాలు వెలుగులోకి రావడానికి తమ్మినేని బృందం శాస్త్రీయ పరీక్షలకు సహకరించాలని డిమాండ్ చేశారు. రామారావు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

ముద్ర, దేవరకొండ: కొండమల్లేపల్లి మండలంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు అవగాహన నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాయకులు రామావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప హక్కులో ఓటు హక్కు ఒకటి ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు. సమాజంలో మార్పు రావాలంటే విద్యావంతులు రాజకీయ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దిశెట్టి సత్యం, చింతకుంట్ల సర్పంచ్ కావటి వెంకటేష్, దాచేపల్లి నరేందర్, శేఖర్ యాదవ్, బోడ యాదగిరి, రజినికాంత్, మూడవత్ పాండు నాయక్, నేనావత్ శంకర్ నాయక్, కోర్ర భీమా నాయక్, రావుల సత్యనారాయణ, రామాంజనేయ చారి,లక్ష్మణ్ నాయక్, గౌస్ పాషా, యాదయ్య, శ్రీను, శంకర్, ఆజీజ్ తదితరులు పాల్గొన్నారు

నీటిని పొదుపుగా వాడాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని ఎక్కడా నీటిని వృధా చేయవద్దని భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ప్రజలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 35వ వార్డులో ఎల్ సీనో వార్డు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వార్డు సభలో చైర్ పర్సన్ వార్డు ప్రజలతో, ముఖ్యంగా మహిళలతో నేరుగా మాట్లాడుతూ వార్డులోని త్రాగునీటి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.– 35వ వార్డులో ఉన్న బోరుబావుల పనితీరు, నీటి లభ్యత, రోజువారీ నీటి సరఫరా సమయాలపై ఆరా తీశారు. లీకేజీలు, నల్లా కనెక్షన్ సమస్యలు ఉంటే వెంటనే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సభలో మున్సిపల్ కమిషనర్ కె చంద్ర ప్రకాష్ రెడ్డి, వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది, ఎం ఏ ఈ లు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిఎంహెచ్ఓ, అధికారులకు షోకాజ్ నోటీసులు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : జిల్లాలోని టి–హబ్ కార్యక్రమం కింద నిర్వహించే ఉచిత వైద్య పరీక్షల శాంపిల్ల సేకరణ, వాటి రిపోర్టులను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం .మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ వి.వంశీ కృష్ణ కు జిల్లా కలెక్టర్ కంగ్రాట్స్ జయంతి శుక్రవారం షో–కాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆర్థికసాయం అందజేత

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : మండలంలోని తుక్కాపురం గ్రామంలో గురువారం ప్రమాదవశాస్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లఇల్లు దగ్ధమై 5 లక్షల ఆస్తి నష్టం జరిగిన కొసన్ విజయ్ కుటుంబానికి బిజెపి నాయకులు, కార్యకర్తలు రూ.23,500 ఆర్థికసాయం అందజేశారు. తుక్కపురం బిజెపి బూత్ అధ్యక్షులు వల్లపు శివాజీ, గోపగాని మహేందర్, వల్లపు సతీష్, ఎలకొండ రాజశేఖర్ రెడ్డి, రత్నపురం శ్రీకాంత్, కమటం రాజ మోహన్, రాసాల పుల్లయ్య, ఎలకొండ సుధాకర్ రెడ్డి, పుట్ట రాజశేఖర్, కోల శివ రాసాల మహేష్ రాచకొండ ప్రకాష్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు

నిత్య కల్యాణ మండపం, రాయగిరి వద్ద భారీ ఆర్చి నిర్మాణం

సొంత నిధులతో నిర్మాణాలకు ముందుకొచ్చిన దేవస్థాన చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

ముద్ర, యాదాద్రి భువనగిరి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యాల మెరుగుదలకు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ సత్యనారాయణ రెడ్డి తన సొంత నిధులతో ఈ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారు.అభివృద్ధి పనుల్లో భాగంగా దేవస్థానంలో నిత్య కల్యాణ మండపం నిర్మాణంతోపాటు రాయగిరి వద్ద భారీ స్వాగత తోరణం (ఆర్చి) ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొననున్నారు. అభివృద్ధి పనులు పూర్తయితే వచ్చే భక్తులకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

రామప్పలో వేలం పాటలకు బ్రేక్..!

పంచాయతీ పాలకవర్గం, దేవాదాయ శాఖ మధ్య వాగ్వివాదం

అధికారుల రంగ ప్రవేశం

తాత్కాలికంగా వాయిదా వేసిన అధికారులు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 30: వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం వద్ద శుక్రవారం నిర్వహించనున్న కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర వంటి ప్రసాదాల వేలం పాటలు వాయిదా పడ్డాయి.రామప్ప ఆలయ పరిసరాల్లోని దుకాణ సముదాయాలు, పార్కింగ్ ప్రదేశాల వేలం పాటలతో పాటు కొబ్బరి కాయలు, లడ్డు, పులిహోర వంటి ఇతర వేలం పాటల నిర్వహణపై పాలంపేట పంచాయతీ పాలకవర్గం మరియు దేవాదాయ శాఖకు మధ్య గత కొంతకాలంగా భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.ఆదాయంలో వాటా, నిర్వహణ బాధ్యతల విషయంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగటంతో వేలం పాట వేదిక వద్దే ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను సముదాయించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.ఇరువురి మధ్య నెలకొన్న సమస్య పరిష్కారం అనంతరం మళ్ళీ వేలం పాటలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లగొండ రాజు, ఉప సర్పంచ్ చింతం ప్రకాష్, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉమ్మడి భాస్కర్ తోపాటు దేవాదాయ శాఖ సిబ్బంది, పాలంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

న్యాయాన్ని హత్య చేసిన ఖమ్మం సీపీ

–సీపీఎం నేత తమ్మినేని

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 30 : జిల్లాలో న్యాయాన్ని, నిజాన్ని పోలీసులు నిలువునా హత్య చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతర్లపాడు సీపీఎం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు.సీపీఎం రాష్ట్ర నేత సామినేని రామారావును గతేడాది అక్టోబర్ 30వ తేదీ తెల్లవారుజామున ఆయన ఇంట్లోనే కిరాతకంగా కత్తులతో పొడిచి చంపారని, ఏడాది గడిచినా ఇంతవరకు అసలైన హంతకులను, వారి వెనుక ఉన్న రౌడీలను పోలీసులు అరెస్టు చేయలేదని దుయ్యబట్టారు. ఖమ్మం సీపీ అబద్ధపు కట్టుకథలు అల్లుతూ, మసిబూసి మారేడుకాయ చేసే రీతిలో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అరెస్టు చేశామంటూ సీపీ ప్రెస్ మీట్ పెట్టడం సిగ్గుచేటని, అసలు హంతకులను తప్పించేందుకు సీపీ స్థాయిలో కథలు అల్లి ఐపీఎస్ పదవికే అప్రతిష్ట తెచ్చారని విమర్శించారు. ఘటనలో వాడిన కత్తుల సైజు కంటే ప్రెస్ మీట్‌లో పోలీసులు చూపించిన సంచుల సైజులు పెద్దవిగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.పోలీస్ కమిషనర్ హంతకులను మించిన హంతకుడిగా వ్యవహరిస్తూ ఖమ్మానికి కలంకంగా మారారని తమ్మినేని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రోత్సాహంతోనే అసలైన నిందితులను తప్పిస్తున్నారని, ప్రస్తుతం వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నా, ప్రభుత్వం మారిన వెంటనే నిజమైన హంతకులను చట్టం ముందు నిలబెట్టే వరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. పాతర్లపాడును ప్రజలు సీపీఎం కంచుకోటగా మార్చారని, రామారావు ఆశయాలను తప్పక సాధిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా అసలైన సూత్రధారులను, పాత్రధారులను పట్టుకుని శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశం అనంతరం రామారావు కుటుంబాన్ని నేతలు పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కళ్యాణపు వెంకటేశ్వరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి దేశబోయిన ఉపేందర్, సర్పంచ్ ఓబనబోయిన లక్ష్మి, ఉపసర్పంచ్ దారెల్లి సురేష్, మాజీ ఎంపీటీసీ జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

1న ఢిల్లీలో ఓట్ బచావో - దేశ్ బచావో నిరసన ర్యాలీ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 30 : 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న నిరసన ర్యాలీకి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి బస్సు బయలుదేరింది. ఈ యాత్రను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో చేపట్టే ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బస్సు యాత్రలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సాధు రమేష్ రెడ్డి, కిలారు అనిల్, బలుసు లక్ష్మీ, గంగరాజు యాదవ్, ఆసిఫ్ తదితర నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంగళూరు ఇంగ్లీష్ ట్రైనింగ్ కు శ్యాం ప్రసాద్



ముద్ర ప్రతినిధి, ములుగు: బెంగళూరులో జరిగే ఇంగ్లీష్ శిక్షణ శిబిరానికి ములుగు జిల్లా నుంచి వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు శ్యామ్ ప్రసాద్ ఎంపికైనట్లు శుక్రవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూకల శ్యాం ప్రసాద్ మాట్లాడారు. నవంబర్ 3 నుంచి డిసెంబర్ 2 వరకు నెలరోజుల పాటు బెంగళూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ జనభారతి క్యాంపస్ లో శిక్షణ అందిస్తారని అన్నారు.అనంతరం జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యా బోధనను మెరుగు పరచడానికి ఉపాధ్యాయుల నైపుణ్యాలను పెంపొందించడంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఏ ఎం ఓ శ్యాంసుందర్ రెడ్డి , మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ , జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ సంఘం నాయకులకు ప్రోత్సహించిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు శ్యాం ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 31.10.2026
www.mudranews.in | @mudranews

రక్తపోటు అదుపులో ఉంటుంది

అరటిపండులో పుష్కలంగా ఉండే పొటాషియం శరీరంలో సోడియం ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో రక్తపోటు నియంత్రణకు, గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.



అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

హార్మోనియం, తబలా వాయించిన చిట్టి చేతులు

రాష్ట్ర స్థాయికి ఎంపిక

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శ్రీ పి.ఎం.శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి కళలు, సాంస్కృతిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ప్రతి పాఠశాల 4 విభాగాలు... డ్రాయింగ్, సంగీతం, నృత్యం, హస్తకళలపై పోటీలు జరిగాయి. చిన్నారులు తబ లా, హార్మోనియం, డ్రమ్స్ వాయిస్తూ ఔరా అనిపించారు. జానపద పాటలపై నృత్యాలతో పూనకాలు తెప్పించి తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారు. పాటలు పాడి అలరించారు. మరోవైపు డ్రాయింగ్, హస్తకళలకు సంబందించి విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు.

చదువుతో పాటు కళల్లో రాణించాలి

అదనపు కలెక్టర్ నగేష్విద్యార్థులు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో కళలు ,సాహిత్యం వైపు దృష్టి మళ్లించడానికి ఇది ఒక చక్కని కార్యక్రమం అని తెలిపారు.విజేతలు వీరే....మొత్తం నాలుగు విభాగాలలో నిర్వహించారు. ఆర్ట్ లో తేజస్విని తెలంగాణ మైనార్టీ రెసిడెనియల్ స్కూల్ (శంకరంపేట-ఆర్),డాన్స్ లో వైష్ణవి, 10వ తరగతి, జడ్పీ హై స్కూల్ (కుసంగి), సంగీతంలో హర్షవర్ధన్ 8వ తరగతి, గురుకుల పాఠశాల (తూప్రాన్),క్రాఫ్ట్ లో గోవర్దన్, 10వ తరగతి, (గోమారం) ఉన్నారు. ఈ పోటీలలో ఒక్కొక్క పాఠశాల నుండి విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ప్రతి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు మెమెంటో, ప్రశంస పత్రాలు అందజేశారు. నాలుగు విభాగాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు ఒక గైడ్ టీచర్ తో పాటు హైదరాబాదులో నవంబర్ 4న రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. డిఈఓ రాజు, సీఎంఓ సుదర్శన్ మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, అంజాగౌడ్, నర్సింగ రావు,, చంద్రకాంత్, జడ్జిలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

భట్టి డైరెక్షన్ లో సీపీ కట్టుకథలు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 30 : సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం సీపీ సునీల్ దత్ పూర్తిగా పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సుందరయ్య భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అసలు హంతకులను, రౌడీలను కాపాడేందుకు ప్రజాభవన్ లో స్క్రిప్ట్ తయారు చేసి, సీపీ ద్వారా డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. భట్టి అన్యాయాలను, అవినీతిని ప్రశ్నించినందుకే రామారావును హత్య చేయించారని, ఆ రాజకీయ కక్షతోనే సీపీ తప్పుడు కథలు అల్లుతున్నారని విమర్శించారు. హత్యకు ముందు రామారావు చేసిన పాదయాత్ర ఆడియోను ఈ సందర్భంగా విలేకరులకు వినిపించారు. సీపీ సునీల్ దత్ అధికార పక్షానికి ఊడిగం చేస్తూ ఐపీఎస్ వ్యవస్థకే కళంకం తెస్తున్నారని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఏడాది గడిచినా అసలు నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు విఫలమయ్యారని, రామారావు భార్య అనుమానితులను గుర్తుపట్టి చెప్పినా విచారించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, డీజీపీలను కలిసి సిట్ విచారణతో పాటు సీపీ సస్పెన్షన్ ను కోరనున్నట్లు వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, దోషులు శిక్షించబడే వరకు వీధోద్యమాలతో పాటు న్యాయపోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, బండి పద్మ, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, విక్రమ్, చింతలచెర్వు కోటేశ్వరరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్ నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సందర్శన

ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ వైద్యులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది, విధుల హాజరుపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి సూపరిండెంట్ వంశీ,డాక్టర్లు డా.మీర్జా, డా.ప్రేమ వర్ధిని, డా దుర్గా, డా.రాము, డా.వసుధ, డా. వీణా ప్రియదర్శిని, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్లు సిబ్బంది ఉన్నారు.త్రాగునీరు వృధా చేయవద్దుత్రాగునీరు వృధా చేయొద్దని కలెక్టర్ సూచించారు. కౌడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో నీటి వనరుల లభ్యత, ఇందిర ఇండ్ల నిర్మాణం, విబిజిరాంజి పనులపై ఎంపీడీఓతో కలిసి సమీక్షించారు. ఎల్ నినో ప్రభావం వల్ల త్రాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ త్రాగునీటిని వృధా చేయొద్దని, నీటిని సంరక్షించాలన్నారు.గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మొదటి, రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యి మొదలు పెట్టని వారిని మోటివేషన్ చేసి, అధికారుల సూచనలతో తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. విబిజిరాంజి ఉపాధి హామీ పథకంలో అనేక రకాల పనులు ఉన్నాయన్నారు. వెంట డిసిహెచ్ఎస్ డా.శివ దయాల్ ఉన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు

ముద్ర ప్రతినిధి, మెదక్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడటం గొప్ప సేవ, రక్తదాతలు దేవుడి రూపంలో వచ్చి ప్రాణదానం చేసిన వారితో సమానమని ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామాయంపేటలో లయన్స్ క్లబ్, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో, రామాయంపేట సర్కిల్ పోలీసుల సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. అనంతరం రామాయంపేట పోలీసులు నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. షీ టీమ్స్ అవగాహన, సైబర్ భద్రతపై కానిస్టేబుల్ ప్రసాద్ రచించిన పాటలను ఆవిష్కరించి, అభినందించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐ సైదా, ఎస్సైలు బాలరాజు, రాజేష్, శివానందం, చైతన్య కుమార్ రెడ్డి, సృజన, పోలీసు సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సభ్యులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.క్రికెట్ విజేత జట్టుకు సన్మానంకరీంనగర్‌లో జరిగిన ఇంటర్ జోనల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో మెదక్ జిల్లా పోలీస్ జట్టు సత్తా చాటింది. ఫైనల్‌లో సిరిసిల్ల పోలీస్ జట్టుపై 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ టోర్నమెంట్‌లో మెదక్, సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల పోలీస్ జట్లు పాల్గొన్నాయి. తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన మెదక్ జట్టు సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం ప్రదర్శించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో సిరిసిల్ల జట్టును ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది.టోర్నమెంట్‌లో మూడు మ్యాచ్‌లలో కలిపి 295 పరుగులు సాధించిన సాయి లాటి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సీఐలు మహేష్, వెంకట రాజా గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ హితం కోసం పాటుపడాలి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 30 : ఆర్థిక అసమానతల కారణంగా సమాజం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదని, వీటి నిర్మూలనకు సమాజ హితం కోరే ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, వ్యవసాయ శాఖ ఏడీ కొంగర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కృషిభవన్‌లో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్ట్ శ్రీనివాసరావుకు రూ.15 వేల ఆర్థిక సహాయం ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు సమాజ హితం కోసం శ్రమించే జర్నలిస్టుకు కష్టకాలంలో చేయూత నందించడం, ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు తోడ్పడటం ప్రశంసనీయమన్నారు. సమాజంలో అన్ని వర్గాల పేదలకు అండగా నిలుస్తున్న సీతారత్నం ట్రస్ట్ సేవా నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 30: జిల్లాలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సర్వే ద్వారా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కోర్సులు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్ఐఈఎల్ఐటీ, ఆర్సెట్టి, సీఐటీడీ, టాస్క్ తదితర సంస్థల సమన్వయంతో యువతకు శిక్షణతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు.స్థానిక పరిశ్రమలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి లభించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. టాస్క్ సమన్వయంతో జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే యువతకు విస్తృత స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు.సమావేశంలో డీఆర్వో డి.ప్రేమ్‌రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎం.ఎ.భారతి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ కార్యవర్గం

ముద్ర ప్రతినిధి మెదక్: ఉమ్మడి మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా న్యాయవాది కె.జనార్దన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా: డాక్టర్. కె. ప్రభు, కోశాధికారిగా ఏ. నరేష్, ఉపాధ్యక్షులుగా జి. మోహన్ లాల్, జి. ప్రవీణ్, వి.అంజలి, సహకార దర్శులుగా ఎస్. వినోద్, డి. రజిత, సభ్యులుగా జి.మురళీధర్, ఎం. గోపాల్,పి. సాయి కృష్ణారెడ్డిలు నియామకమయ్యారు. ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులుగా ఎస్.నాగరాజు హాజరయ్యారు.జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పిడి ఆనందం, శిరిగ ప్రభాకర్, ఎస్. నాగరాజు, మధుసూదన్, శ్రీనివాస్, పార్థివ నాథ్, సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ డాక్టర్ కె. రామాదేవి ఆధ్వర్యంలో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పొడిగింపు, సవరించిన షెడ్యూల్ గురించి వివరించారు. నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియ గడువును నవంబర్ 26 వరకు పొడిగించినట్లు, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 30న ప్రచురించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం కేవలం 387 నోటీసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛత మన బాధ్యత.. శ్రమదానం మన కర్తవ్యం

జిల్లా కలెక్టర్,ఎస్పీ

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : స్వచ్ఛత మన బాధ్యత.. శ్రమదానం మన కర్తవ్యమని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి శుక్రవారం పట్టణంలోని చెరువు కట్టపైన శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని స్వయంగా శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని చెరువు కట్టపైన పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కేవలం పోలీసు సేవలకే పరిమితం కాకుండా, సమాజహితం, ప్రజా సంక్షేమం, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కలెక్టర్ ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణ డిఎస్పీలు రవీందర్, శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐలు హనుమంత్ నాయక్, సత్యనారాయణ వెంకటేశ్వర్లు, చంద్రబాబు,ఆర్ఐ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు రూరల్ ఎస్‌హెచ్ఓ అనిల్ ఎస్ఐలు పోలీస్ సిబ్బంది మరియు మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీ వాణి, గ్రంథాలయ చైర్మన్ అవైస్ చిష్టి, హైదరాబాద్ డిఫెన్స్ విద్యార్థులు, డైలీవాకర్స్ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాను కరువు జిల్లాగా ప్రభుత్వం వెంటనే ప్రకటించి, 10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ, కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. మెదక్ జిల్లా వ్యవసాయంపై ఆధారపడిందన్నారు. జిల్లాలో సాగునీటి వనరులు కూడా పెద్దగా లేవు. వర్ష ఆదారిత పంటలే అధికంగా వేస్తారు. వర్షాలు లేక జిల్లాలోని 21 మండలాల్లో రైతులు వేసిన పంటలు ఎండి పోయాయన్నారు. ఒక్క మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయం జిల్లాలోని రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ప్రతి ఎకరాకు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు దుర్గ, షౌకత్, వెంకట్ ఉన్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారి తనిఖీలు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి పట్టణంలోని హోల్సేల్, రిటైల్ వ్యాపార కేంద్రాలలో శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. భువనగిరి గంజ్ మార్కెట్లో రాహుల్ రైస్ కిరాణం, కల్కి కిరాణం, సహస్ర ట్రేడర్స్, ఓం ట్రేడర్స్, పలు వ్యాపార కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. వివిధ రకాల బియ్యం లభ్యత, నిల్వల వివరాలను ధరలను సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా బియ్యం సరఫరా జరిగేలా వ్యాపారులు తగినంత నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన మేరకు నిల్వలను ఎప్పటికప్పుడు భర్తీ చేసుకోవాలని, బియ్యాన్ని న్యాయమైన ధరలకు విక్రయించాలని సూచించారు. స్టాక్ బోర్డులలోని వివరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

'స్టాండ్ విత్ హర్' పై విద్యార్థులకు శిక్షణ

ముద్ర ప్రతినిధి, మెదక్: తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని నేర పరిశోధన, అవినీతి నిరోధక, మహిళా భద్రతా విభాగాల డీజీ చారు సిన్హా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో భాగంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఫైనల్ ఇయర్ కు చెందిన యు. ఉదయ్ కుమార్, డి. మానస ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్ ఎంపికై శిక్షణ పొందారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సింహారెడ్డి మాట్లాడుతూ, శిక్షణ పొందిన విద్యార్థులు రాబోయే రోజుల్లో కళాశాలలోని ఇతర విద్యార్థులకు మహిళా భద్రత, లింగ సమానత్వం, పరస్పర గౌరవం, సానుభూతి, సమర్థవంతమైన సమాచార మార్పిడి, బాధ్యతాయుతమైన స్పందన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన మొత్తం 12 అంశాలలో మొదటి విడతగా ఆరు ముఖ్యమైన అంశాలపై కళాశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పి. మల్లేశం, మురళీవర్ధిల్లి పాల్గొన్నారు.

మెదక్‌లో ఫ్లాష్ వాక్...సైబర్ నేరాలపై అవగాహన

జెండా ఊపి ప్రారంభించిన ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

ముద్ర ప్రతినిధి, మెదక్: సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వాటి బారిన పడకుండా అప్రమత్తం చేయడమే లక్ష్యంగా మెదక్ పట్టణంలో శుక్రవారం రాత్రి ఫ్లాష్ వాక్ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి రామాలయం మీదుగా రాందాస్ చౌరస్తా వరకు ఈ ఫ్లాష్ వాక్ కొనసాగింది.ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం వెల్లడించవద్దని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని కోరారు.సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L. N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555